RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం 21-03-2025
సంపుటి : 2 | సంచిక : 284 | పేజీలు : 8 | వెల రూ. :5/-



'నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది' మెగాస్టార్ చిరంజీవి

8లో



# మాది మానవత్వ పాలన



- ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మాది
- కారుణ్య నియామకాలపై గతంలో నిర్లక్ష్యం చేశారు
- జాబ్ క్యాలెండర్‌తో పాటు..కారుణ్య నియామకాలు
- నిరుద్యోగులను మోసం చేసినందుకే బిఆర్ఎస్ ఓటమి
- మిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్‌కు పేరుతో పాటు బిజినెస్
- బిల్డ్ నౌ పోర్టల్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు:** సీఎం పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటిసారిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ఆయన పాల్గొని 'బిల్డ్ నౌ పోర్టల్'ను ప్రారంభించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి 922 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కారుణ్య నియామకాలు మీ హక్కు. గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. జాబ్ క్యాలెండర్‌తో పాటుగా కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందే. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదు. పేదలు, బడుగు బలహీన వర్గాలవారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చాం అని వివరించారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓడిపోయింది. మాకు ఉద్యోగాలు ఇవ్వని మీకు ఉద్యోగాలు ఎందుకని నిరుద్యోగులు భారాసను ఓడిరచారు. కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు

మిగతా 2లో





## అధికారం పోయినా ప్రజల్లో
# అభిమానం పోలేదు

- విషప్రచారంతోనే బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది
- అభివృద్ధి పనుల ముందు విషప్రచారమే గెలిచింది
- ప్రజల పక్షాన కొట్లాడుతున్న కార్యకర్తలు వీరులు
- సూర్యాపేట సభలో కెటిఆర్ ప్రసంగం

**సూర్యాపేట, ప్రభాతసూర్యుడు:** ఓ సింగర్ చెప్పినట్లుగా...అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి అసూయ, ద్వేషం, ఆశ కారణమైనట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మూడిరటి వల్లే బీఆర్ఎస్ పార్టీ అనుకున్నన్ని సీట్లు సాధించలేకపోయిందని ఆ సింగర్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మెడికల్ కాలేజీలు, దామరచర్ల విద్యుత్ ప్లాంట్, యాదాద్రి ఆలయంతో పాటు ఎన్నో ప్రాజెక్టులు నిర్మించాం కదా.. ఎందుకు ఓడిపోయామని ఓ సింగర్‌తో అంటే.. ఆయన ఇలా సమాధానం చెప్పారు. అసూయ అంటే అధికార పార్టీలోకి రాగానే ఎమ్మెల్యేలు కొత్త కారు, కొత్త ఇల్లు కట్టుకున్నాడని ప్రచారం చేశారు. ఇది వరకు అంగి లేకుండా తిరిగినట్టు ఇవాళ కొంత మంది నాయకులు కొత్త అంగి వేసుకున్నట్టు అసూయ పడ్డారు. మరో వైపు ద్వేషం..ఈ రాష్ట్రాన్ని కుటుంబం కోసం తెచ్చినట్టు.. దొర పాలన అని ప్రజల్లో ద్వేషం నిండే విధంగా అగ్ర నాయకత్వంపై ప్రచారం చేశారు. ఇక ఆశ.. కేసీఆర్ పదివేలు ఇస్తుండు.. నేను పదిహేను వేలు వేస్తా.. ఇద్దరికీ పెన్షన్లు ఇస్తా అని ఆశ పెట్టిండు. ఎతుల వెంకట్ రెడ్డి, కోతుల ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశలు పెట్టి మోసం చేశారు. కాంగ్రెసోడు, బీజేపోడు అభివృద్ధి గురించి మాట్లాడలేదు. మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీసు గురించి మాట్లాడలేదు. కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల గురించి చెప్పలేదు. అసూయ, ద్వేషం, ఆశ నింపి ఓడగొట్టారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగాయి. దాంతో అందరి సంపద పెరిగింది. టీఆర్ఎస్ సంపద

మిగతా 2లో



## బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట

### జిహెచ్ఎంసి ఎన్నికల కేసు కొట్టివేత

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచార సమయంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారనే ఆరోపణలపై సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

2లో

## కీచక ప్రొఫెసర్ అరెస్ట్

- విద్యార్థినులపై లైంగిక దాడులు...
- ఆపై బ్లాక్ మెయిలింగ్...
- ప్రొఫెసర్ రజనీష్ కుమార్ అరెస్ట్
- లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన వైనం
- 2009 నుండి నేరాలకు పాల్పడుతున్నట్లు అంగీకారం
- 65 వీడియోలు స్వాధీనం



ద్యార్థినులను లైంగికంగా వేధించిన ఆరోపణలపై హత్రాస్ లోని సేథ్ ఫూల్ చంద్ బాగ్లా పీజీ కళాశాల చీఫ్ ప్రొక్టర్‌గా పనిచేస్తున్న రజనీష్ కుమార్ (50)ను పోలీసులు యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో అరెస్టు చేశారు.

5లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

### హరీష్ రావు,మాజీ డిసిపి రాధాకిషన్ రావుల కేసు కొట్టివేత






**హైదరాబాద్,ప్రభాతసూర్యుడు:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు , మాజీ డీసీపీ రాధాకిషన్ రావులకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఫోన్‌టాపింగ్ కేసులో ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ టాపింగ్ కేసు నమోదు అయ్యింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ డీసీప రాధాకిషన్ రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ఇప్పటికే వాదనలు ముగియగా.. ఈరోజు హైకోర్టు తీర్పు వెలువరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు

మిగతా 5లో


## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

### 22 మంది మావోలు హతం



ఛత్తీస్‌గఢ్ లోని దండకారణ్యంలో మరోసారి కాల్పుల మోత మోగింది. బీజాపూర్-దంతెవాడ సరిహద్దుల్లో భద్రతా బలగాలు జరిపిన ఎన్ కౌంటర్ లో చాలా మంది మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్-దంతెవాడు భద్రతా దళాలు మావోయిస్టులపై దాడి చేసి రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మందిని హతమార్చాయి.

2లో



## మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం

- మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం
- మే 7 నుండి 31వ తేదీ వరకు పోటీలు
- తెలంగాణ ఖ్యతి.. పర్యాటకానికి మహర్దశ
- ప్రీ ఈవెంట్ వేడుకల్లో మంత్రి జూపల్లి వెల్లడి

2లో

## ఎస్సీవర్గీకరణ హీరోలు మందకృష్ణ, చంద్రబాబు

- వారిద్దరి వల్లనే వర్గీకరణకు న్యాయం దక్కింది
- మందకృష్ణ గుండె ధైర్యంతో మాదిగలకు బలం
- ఎస్సీవర్గీకరణ చర్చలో పవన్ కళ్యాణ్

ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.



2లో

## రుషికొండ భవనాలపై ఆలోచన చేస్తున్నాం

- ఏపి సద్దాంగా ఊహించుకున్న జగన్
- అందుకే 700 కోట్లతో భవనాల నిర్మాణం
- జగన్‌పై మంత్రి లోకేశ్ విమర్శలు



2లో

# బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట

**హైదరాబాద్,ప్రభాతసూర్యుడు:**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచార సమయంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారనే ఆరోపణలపై సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయనపై ఛార్జ్‌షీట్ కూడా దాఖలైంది. అయితే, తగిన ఆధారాల్లేవన్న కారణంతో హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నాయకుడు బండి సంజయ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో స్పందించిన సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. బండి సంజయ్‌పై నమోదైన కేసు హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా బండి సంజయ్ తరఫున న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. బండి సంజయ్ మత విద్వేషాలను రెచ్చగొట్టారని నిరూపించే ఆధారాలు లేవని న్యాయవాది వాదించారు. ఆధారాలు లేకుండా రాజకీయం చేయడానికి కేసు నమోదయ్యిందని కోర్టుకు వివరించారు. కేవలం రాజకీయ కారణాల రీత్యా ఈ కేసును పెట్టారని, న్యాయపరంగా దీని ఆధారభూతతను పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ వాదనలను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి, బండి సంజయ్‌పై నమోదు చేసిన కేసులో తగిన ఆధారాలు లేవని తేల్చారు. ఎలాంటి నేరపూరిత ప్రకటనలు లేకుండా కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. అన్ని వాదనలు పరిశీలించిన తర్వాత, బండి సంజయ్‌పై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. తగిన ఆధారాల్లేకుండా నేరపూరిత ఉద్దేశంతో కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుపై బండి సంజయ్ అనుచరులు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాజకీయ కక్ష సాధింపుకు నిదర్శనమని, న్యాయం గెలిచిందని బీజేపీ నేతలు పేర్కొన్నారు.




# అధికారం పోయినా ప్రజల్లో అభిమానం పోలేదు

**మొదటిపేజీ తరువాయి**




పెరగొద్దు.. కానీ కాంగ్రెస్, బీజేపీ సంపద పెరగాలట. కేసీఆర్ దొర అని యూట్యూబ్‌లో పనికిమాలిన చెత్త మాట్లాడి తిట్టని తిట్లు తిట్టి విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చిండు. ఇవాళ అదే యూట్యూబ్ వాళ్లను గుడ్డలుడదీసి కొడుతాడట. ఆయన కాడికి వస్తే అన్ని గుర్తుకు వస్తున్నాయి. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిండు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని దేశానికి చాటింది మొదట ఎన్టీఆర్.. ఆ తరువాత కేసీఆర్ అని తెలిపారు. గులాబీ జెండా లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు అని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీగా కూడా సమర్థవంతంగా నిలబడిరది.. విజయవంతంగా ఉద్యమం, సమర్థవంతమైన పాలన అందించింది బీఆర్ఎస్ పార్టీ.. తమ పాలన తెలంగాణ రాష్ట్రానికి అవసరం.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తరువాత బీఆర్ఎస్ పని అయిపోయిందని మాట్లాడుతున్నారని కేటీఆర్ అన్నారు. అయితే, బీఆర్ఎస్ పార్టీకి పోయింది అధికారమే.. ప్రజల అభిమానం కాదు అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణకు ఏనాటికైనా శత్రువే.. బీజేపీ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్ రేవంత్ పై ఈగ వాలకుండా కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. బండెనక బండి కట్టి.. ఏప్రిల్ 27న వరంగల్ సభకు ప్రజలు కదిలి రావాలి.. అసెంబ్లీ లో జగదీష్ రెడ్డి మంట్లడిరదాంట్లో తప్పులేదు.. స్పీకర్ కు కులం ఆపాదించడం దురదృష్టకరం.. గడ్డం ప్రసాద్ స్పీకర్ కావాలని బీఆర్ఎస్ పోటీ కూడా పెట్టలేదు.. అసెంబ్లీనీ గాంధీభవన్ తో పోల్చిన ఎంఐఎం పై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్ కు లేదు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను, జగదీశ్ రెడ్డి పదేండ్లు మంత్రిగా పని చేశాం. ఇక్కడున్న వారిలో చాలా మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు.. ఇలా రకరకాల పదవులు వచ్చాయి. ఇవాళ బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతున్నది మన కోసం కాదు.. ప్రజల కోసం. టీఆర్ఎస్ పుట్టుక చరిత్రలో అనివార్య పరిస్థితిలో వచ్చింది. ఇవాళ కూడా బీఆర్ఎస్ అధికారం కోరుకోవడం.. తెలంగాణకు చారిత్రక అవసరం. కర్కశ కాంగ్రెస్ పాలన పీడ వదిలించుకోవాలంటే గులాబీ జెండాతోని అయితదని ప్రజలు గుర్తించారని కేటీఆర్ పేర్కొన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క సూర్యాపేట గెలిచింది. పార్లమెంట్ లో ఓడిపోయాం. చాలా మంది అన్నారు అయిపోయింది వీళ్ల పని అని. పార్టీ మూతపడుతది అని మాట్లాడారు. ఒక ఫినిక్స్ పక్షిలాగా ఆకాశాన్ని అందుకునే విధంగా అద్భుతంగా తన పోరాట పటిమతో ముందుకు సాగుతదో.. అదే విధంగా ఇవాళ కదం తొక్కి అటు కాంగ్రెస్‌కు, ఇటు బీజేపీకి కాళరాత్రులు చూపెడుతున్న మీ అందరికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నాం. మేం ఒక్క నిరసనకు పిలుపునిస్తే కేసులు పెట్టినా భయపడకుండా పోరాడుతున్న మీ అందరికీ హృదయపూర్వకంగా మనస్కారం చేస్తున్నా. మీరు గొప్ప పోరాటం చేస్తున్నారు అని కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. సమావేశంలో జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రుషికొండ భవనాలపై ఆలోచన చేస్తున్నాం

**హైదరాబాద్,ప్రభాతసూర్యుడు:**

వైసీపీ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా ఊహించుకున్నారని మంత్రి లోకేశ్ మండిపడ్డారు.. 30 ఏళ్ల పాటు పదవిలో కొనసాగుతానని కలలు కన్నారంటూ లోకేష్ ఎద్దేవా చేశారు. రుషికొండలో నిర్మించిన విలాసవంతమైన ప్యాలెస్ పై స్పందిస్తూ.. పైవిధంగా వ్యాఖ్యానించారు. రుషికొండ ప్యాలస్ గురించి నారా లోకేష్ మాట్లాడుతూ.. 'తొలుత ఇది ఏపీ ప్రభుత్వ పర్యాటక శాఖ ప్రాజెక్ట్.. తర్వాత అది శిశ్ మహల్ గా మారింది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా భావించారు. అందుకే మరో 30 ఏళ్ల పాటు తానే పదవిలో ఉంటానని నమ్మి.. అంత విలాసవంతమై భవనాన్ని నిర్మించారని చెప్పుకొచ్చారు. లోకేష్ మాట్లాడుతూ.. 'మా తాత, నాన్న ఇద్దరు ముఖ్యమంత్రులుగా పని చేశారు. కానీ వారి హయాంలో నేను ఇంత విలాసవంతమైన భవనాన్ని, ఇంత పెద్ద గదులను చూడలేదు. శిశ్ మహల్ నిర్మాణం కారణంగా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ రాష్ట్ర ప్రభుత్వం మీద 200 కోట్ల రూపాయల జరిమానా విధించింది' అని తెలిపారు. 'వైసీపీ అధ్యక్షుడిది చాలా చిన్న కుటుంబం. ఆయన తల్లి, సోదరిలను కుటుంబం నుంచి పంపించి వేశారు. ప్రస్తుతం ఆయన, భార్య, పిల్లలు మాత్రమే ఉన్నారు. కేవలం నలుగురు కుటుంబ సభ్యుల కోసం 700 కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఆఖరికి ప్రధాన మంత్రి కూడా ఇంత పెద్ద ఇంట్లో నివాసం ఉండరని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం ఆ భవనాన్ని ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై ఆలోచనలు చేస్తుంది అని తెలిపారు.







# మాది మానవత్వ పాలన

**మొదటిపేజీ తరువాయి**

లేదన్నారు. నిరుద్యోగుల బాధలు నాకు తెలుసు. ఉద్యోగ ఖాళీలను పెండిరగ్ పెట్టొద్దని ఆదేశాలిచ్చా. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు ఇచ్చాం. 30, 40 రోజుల్లో గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం. ఉద్యోగాలు ఇచ్చినా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇదే సందర్భంలో విపక్షాల విమర్శలపై ధీటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, సీఎంపై ప్రజలు కోపంతో ఉన్నారని ప్రతిపక్షాలు చేస్తోన్న విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. నా మీద వ్యతిరేకత, కోపం ఉందని కొందరు అంటున్నారు.. రైతు రుణ మాఫీ చేసినందుకు నాపై కోపంగా ఉన్నారా..? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు కోపంగా ఉన్నారా..? మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రయత్నం చేస్తున్నందుకు కోపంగా ఉన్నారా..? 59 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకు నాపై కోపంగా ఉన్నారా..? దేనికి ప్రజలు నాపై కోపంగా ఉంటారంటూ ప్రతిపక్షాలపై మండిపడ్డారు. అలాగే.. రేవంత్ రెడ్డికి పాలన మీద పట్టు రాలేదంటూ వస్తోన్న విమర్శలపైన ఆయన స్పందించారు. రేవంత్ రెడ్డికి పాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారు.

రాజయ్యను కారణం లేకుండా మంత్రి పదవి నుంచి తొలగిస్తే పట్టు వచ్చినట్టా..? సచివాలయానికి రోజు వెళ్లకపోతే పట్టు వచ్చినట్టా అని ప్రశ్నించారు. ఏమి తెలియకుండానే ఈ స్థాయికి వచ్చానంటారా..? నల్లమల్ల నుంచి వచ్చా.. మానవ మృగాలు ఎలా ఉంటాయో నాకు తెలియదా అని హాట్ కామెంట్స్ చేశారు. కాకపోతే సీఎం అనేటోడికి విజ్ఞత ఉండాలని.. అందుకే నేను విజ్ఞతతో ప్రవర్తిస్తున్నానని అన్నారు. అందుకే ఇవాళ సామాన్యుడు కూడా సెక్రటేరియట్‌కు వస్తున్నారన్నారు. నేను ఆదేశాలు ఇస్తే కేటీఆర్ ఈపులు పగొలగొట్టరా..? కోదండరామ్ ఇంటి తలుపులు పగలగొట్టినోళ్లు కేటీఆర్ ఇంటి తలుపులు పగలకొట్టడం ఎంతసేపు.. వాళ్లలాగే మేం అణిచివేయాలనుకుంటే ఎంతసేపు అని హాట్ కామెంట్స్ చేశారు. ఇకపోతే టిటిడి వ్యవహారంపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. వారికి టిటిడి ఉంటే మనకు వైటిడి, భద్రాద్రి ఉందన్నారు. వాళ్లను బతిలాడి దర్శనం కోసం పాకులాడాలా అని అన్నారు. మకు ఇక్కడ శివాలయాలు తక్కువా అని అన్నారు. మిస్ ఇండియా పోటీలు నిర్వహిస్తే కెటిఆర్‌కు వచ్చిన నొప్పేందని అన్నారు. ఫార్ములా కేసులో కోట్లు కొల్లగొట్టిన నీకు నాపై మాట్లాడే అర్హత లేదన్నారు. మిస్ ఇండియా పోటీలతో 3వేల ఛానల్స్ వస్తున్నాయని, ఫుడ్ ఇండస్ట్రీకి పెద్ద పండగని అన్నారు. కెసిఆర్ మందు డోర్ డెలివరీ చేస్తే..నేను ఇసుక డెలివరీ చేస్తున్నా.. జానారెడ్డి లాంటి వారిని అవమానించారు. సిఎం అయినంత మాత్రాన టెంపర్ మారదని రేవంత్ స్పష్టం చేశారు.



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

## 22 మంది మావోలు హతం

**ఛత్తీస్‌గఢ్, ప్రభాతసూర్యుడు:**

ఛత్తీస్‌గఢ్ లోని దండకారణ్యంలో మరోసారి కాల్పుల మోత మోగింది. బీజాపూర్‌దంతెవాడ సరిహద్దుల్లో భద్రతా బలగాలు జరిపిన ఎన్ కౌంటర్ లో చాలా మంది మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్‌దంతెవాడు భద్రతా దళాలు మావోయిస్టులపై దాడి చేసి రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మందిని హతమార్చాయి. ఈ భారీ ఆపరేషన్ సమయంలో ఒక సైనికుడు కూడా వీరమరణం పొందాడు. ఎన్ కౌంటర్ స్థలం నుంచి భద్రతా దళాలు భారీ మొత్తంలో ఆయుధాలు, మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్‌దంతెవాడ జిల్లాల సరిహద్దులోని దట్టమైన అడవుల్లో నక్సల్స్ ఉన్నట్లు సమాచారం మేరకు జిల్లాల నుంచి సంయుక్త బలగాలు అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. గురువారం ఉదయం బీజాపూర్, దంతెవాడ సరిహద్దులోని గంగలూరు పోలీస్ స్టేషన్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాల బృందం నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్‌కు బయలుదేరిందని అధికారులు తెలిపారు. ఇరువర్గాల మధ్య ఇంకా ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ ఎన్ కౌంటర్ లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. భద్రతా దళాలు బీజాపూర్‌లో 18 మంది నక్సలైట్లను, కాంకేర్‌లో నలుగురు నక్సల్స్ ను హతమార్చింది. ఈ ఎన్‌కౌంటర్‌లో బీజాపూర్ డీఆర్‌జీకి చెందిన ఒక సైనికుడు అమరుడయ్యాడు. శోధన ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

# ఎస్సీవర్గీకరణ హీరోలు మందకృష్ణ, చంద్రబాబు

**అమరావతి, ప్రభాతసూర్యుడు:**



ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి మందకృష్ణ. ఆ కులానికి వన్నె తెచ్చిన ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయి. గుర్తింపు లేని కులాలపైనా విస్తృతంగా చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదిక చాలా అద్భుతంగా ఉంది. ఇది అందరికీ మేలు చేస్తుందని ఆశిస్తున్నట్లు పవన్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాదగ కులానికి వన్నె తెచ్చిన మందకృష్ణకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అసమానతలపై ఇంకా పోరాటం చేయాల్సి ఉందన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వర్గీకరణపై ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని అన్నారు.

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. కమిషన్ నివేదిక ప్రకారం జిల్లాల వారీగా దామాషా ప్రకారం రిజర్వేషన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో దళితులు అగ్రపథాన నిలిచారని గుర్తు చేశారు. దళిత వాడల్లో సంపద సృష్టి జరిగిందని వివరించారు. 800 ఎకరాలు దళితుల భూములు ఇడుపులపాయ ఎస్టేట్‌లో జగన్‌రెడ్డి కుంటుంబం ఆక్రమించుకుందని ఆయన ఆరోపించారు.

టీడీపీ మరో ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎస్సీలకు సంబంధించిన అనేక పథకాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం టీడీపీ మొదటి నుంచీ కట్టుబడి ఉందని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఉభయ సభల ముందు ప్రవేశపెట్టారు. దీనిపై స్వల్పకాలిక చర్చ జరిగింది. అందులోభాగంగా ఈ అంశంపై సీఎం చంద్రబాబు నాయుడితోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సభలో మాట్లాడారు.

# మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం

**హైదరాబాద్,ప్రభాతసూర్యుడు:**

హైదరాబాద్ మిస్ వరల్డ్ 2025 పోటీలకు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతోంది. మే 7 నుండి 31వ తేదీ వరకు జరగనున్న ఈ అంతర్జాతీయ అందాల పోటీల్లో సుమారు 140 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొనబోతున్నారు. తెలంగాణను అంతర్జాతీయంగా గుర్తింపును తెచ్చే ఈ వేదిక, రాష్ట్ర పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయనుంది. ఈ పోటీల సందర్భంగా, మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందాల భామలు మే నెలలో తెలంగాణలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపద, అభివృద్ధిని వీరు ప్రపంచానికి తెలియజేయనున్నారు. మిస్ వరల్డ్ పోటీలపై మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ పోటీని హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.ఈక్రమంలో బేగంపేట్ టూరిజం ప్లాజాలో గురువారం మిస్ వరల్డ్ పోటీలకు చెందిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లీ, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి అందాల భామలు వస్తారని తెలిపారు. ఇది మహిళా సాధికారతకు అద్దం పట్టే సంబరాలు అని, ప్రపంచ దేశాల నుంచి రాబోయే అతిథులకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసేందుకు ఇదొక గొప్ప అవకాశం అని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఇప్పటికే ధనిక నగరాల్లో ఒకటిగా పేరు తెచ్చుకుంది, ఈ పోటీలతో అంతర్జాతీయంగా మరింత గుర్తింపు పెరుగుతుందని అన్నారు. తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ప్రపంచ వేదికపై తక్కువగా ప్రాచుర్యం పొందింది. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌తో మిస్ వరల్డ్ 2025 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు అవకాశం లభించింది. ఇది రాష్ట్రం యొక్క బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు సహాయపడనుంది. కొంతమంది ఈ ఈవెంట్‌ను రాజకీయ కోణంలో చూస్తున్నా, ఇలాంటి అంతర్జాతీయ వేడుకలు రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు, తెలంగాణ సంపదను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఉపయోగపడతాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే వారితో పాటు వేలాది మంది దేశ విదేశాలకు చెందిన వారు తెలంగాణకు వస్తారని అన్నారు. ఈ వేదిక వల్ల నిరంతరంగా పర్యాటక రంగానికి సంబంధించి రాబడి పెరుగుతుందని తెలిపారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించగలమని అన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.54 కోట్లు పెట్టుబడి పెట్టామని చెప్పారు. అందులో సగమే ప్రభుత్వం కేటాయిస్తుందని..మరో సగం ప్రమోటర్‌ల నుంచి సేకరిస్తామని స్పష్టం చేశారు. ఇది చరిత్రాత్మక కార్యక్రమమని.. సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవు అని వ్యాఖ్యానించారు. మహిళల అంతః సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశమని అన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తెలంగాణలో మహిళలకు అన్ని రంగాల్లో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పుకొచ్చారు. సౌత్ కొరియా స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి దేశ ఎకానమీకి ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ పెరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఈ అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు, రాజకీయ కోణంలో ఈ పోటీలను చూడటం సరికాదని మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు పలికారు. బేగంపేట్ టూరిజం ప్లాజాలో ఇవాళ జరిగిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పాల్గొని సందడి చేశారు. నమస్తే ఇండియా అంటూ 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పలకరించింది. అతిథులు చాలా గొప్పగా స్వాగతం చెప్పారని అన్నారు. తన ప్రయాణంలో, తన హృదయంలో భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. భారత కల్చర్, ఆర్ట్స్ చాలా గొప్పగా ఉంటాయని వివరించారు. భారతదేశం చాలా ఇన్‌స్పైరింగ్ అని తెలిపారు. భారత్ విలువలను బోధిస్తుందని.. భిన్నత్వంలో ఏకత్వానికి ఎంతో గొప్ప భావన ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నో భాషలు ఉన్నా అంత ఒక్కటిగా ఉండటం భారతదేశం స్ఫూర్తి అని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలు కూడా అంతే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని చెప్పారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చిందని క్రిస్టినా పిజ్కోవా పేర్కొన్నారు. తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యత కలిగిందని తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ తెలిపారు. ఈ ప్రాంతానికి 2500 ఏళ్ల చరిత్ర ఉందని ఉద్ఘాటించారు. రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్లలో ఎంతో వృద్ధి సాధించామని చెప్పారు. రామప్ప, వేయి స్థంభాల ఆలయం, చార్మినార్, గోల్కొండ కోట లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మే నెలలో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతి ప్రతిభింభించేలా నిర్వహించనున్నామని చెప్పారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. సినిమా, ఆహార రంగాల్లో తెలంగాణకు పెట్టింది పేరని చెప్పారు. అత్యంత సురక్షిత పర్యాటక ప్రాంతం తెలంగాణ అని స్మితా సభర్వాల్ పేర్కొన్నారు.




21.03.2025 శుక్రవారం
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక


# చిరంజీవికి యూకె పార్లమెంట్ సన్మానం

- లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పుస్కారం అందచేత
- చిరుకు తమ్ముడిగా పుట్టినందుకు గర్విస్తున్నా
- అన్నయ్యకు అభినందనలు తెలిపిన పవన్ కళ్యాణ్





**హైదరాబాద్,ప్రభాతసూర్యుడు:**

ప్రముఖ నటుడు చిరంజీవిని హౌస్ ఆఫ్ కామన్స్ యూకే పార్లమెంట్ లో ఘనంగా సత్కరించారు. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికి, సమాజానికి చేసిన సేవలకుగానూ చిరంజీవికి ఈ గౌరవం దక్కింది. యూకే అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందు మిశ్రా ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. పార్లమెంట్ సభ్యులు సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్‌మాన్ తదితరులు పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది.. చిరంజీవికి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు, ఏయన్నార్ జాతీయ పురస్కారం, ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) 'అవుట్ స్టాండిరగ్ అఛీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' గౌరవం దక్కిన సంగతి తెలిసిందే. 156 సినిమాలు, 537 పాటలు, 24 వేల స్టెప్పులతో ప్రేక్షకులను విశేషంగా అలరించినందుకు ఆయన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు శత వసంతాల వేడుకల్లో భాగంగా ఆ అవార్డును స్వీకరించారు. గతేడాదే.. దేశంలో రెండో అత్యున్నతమైన పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించిన విషయం తెలిసిందే. సినీ, సేవా రంగాల్లో విశేష కృషి చేసిన చిరంజీవికి జీవిత సాఫల్య పురస్కారం అందించింది. చిరుకు ఈ పురస్కారం రావడంపై పవన్‌కల్యాణ్ ఆనందం వ్యక్తంచేశారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ పురస్కారం చిరంజీవి కీర్తిని మరింత పెంచిందన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. సాధారణ మధ్యతరగతి ఎక్సైజ్ కానిస్టేబుల్ కుమారుడిగా జీవితం మొదలుపెట్టి.. స్వశక్తితో, కళామతల్లి దీవెనలతో మెగాస్టార్‌గా ఎదిగారు. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తున్నారు. ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు ఎప్పుడూ గర్వంగా ఉంది. ఆయన్ని అన్నయ్యగా కంటే తండ్రి సమానుడిగా భావిస్తాను. నేను జీవితంలో ఏం చేయాలో తెలియక, అయోమయం లో ఉన్న పరిస్థితుల్లో నాకు మార్గం చూపించిన వ్యక్తి మా అన్నయ్య. నా జీవితానికి హీరో చిరంజీవి. తన సేవాగుణంతో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. తాను ఎదగడమే కాకుండా తన కుటుంబంతో పాటు మరెంతోమంది ఎదుగుదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాయం చేశారు ప్రతిభ ఉంటే ఎవరైనా ఏ రంగంలోనైనా రాణించవచ్చు అనడానికి ఉదాహరణగా నిలిచారు. చిరంజీవి సమాజానికి అందించిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారం కూడా అందించింది. తనకు యూకే పార్లమెంట్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించిన వార్త నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఈసందర్భంగా చిరంజీవికి నా అభినందనలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకొని మా అందరికీ మార్గదర్శిగా ఉండాలని కోరుకుంటున్నాను. ఆ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన యూకే అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందుమిశ్రాకు ప్రత్యేక ధన్యవాదాలు' అని పవన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.



## విద్య రంగాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బడ్జెట్ లో విద్య రంగానికి మొండి చేయి
- కాంగ్రెస్ విద్యారంగానికి అరకోరా నిధులు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్

**జగిత్యాల, ప్రభాతసూర్యుడు:**

విద్యారంగ పట్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం మేనని ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి మొహమ్మద్ అక్రమ్ మాలిక్ ఆరోపించారు.
గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ముందు ఏఐఎస్ఎఫ్ నేతలు తలదించుకొని నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.57 %, 0. 2% నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందన్నారు. కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ ను కూడా విద్యారంగాని కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు .. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15 % నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ గత సంవత్సరం ఈ సంవత్సరానికి 0.2 % మాత్రమే కేటాయించడం దారుణం అని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు, కేటాయించడం తగదన్నారు.
పెండిరగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రీయంబర్స్ గురించి ప్రస్తావన లేదని ఆయన విమర్శించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు. సుమారుగా 11,600 కోట్ల రూపాయలను కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటి.
కస్తూరిబా ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం ఊసే లేదు డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్వంత భవనాలు నిధులు లేవన్నారు. ఈ నిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు ,విద్యా దారిద్ర్యానికి దారి తీస్తాయని అన్నారు.
తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 % అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.. లేని పక్షణ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంద రాకేష్, పట్టణ అధ్యక్షులు మహేష్ ,రూరల్ మండల అధ్యక్షులు అంకటి ప్రణయ్, పట్టణ నాయకులు సాయి చరణ్, జిల్లా సమితి సభ్యులు అరవింద్ మనోజ్ , గర్ల్స్ విభాగం ప్రవళిక, సుష్మా, సింధూ, రవళి, జ్యోత్స్న ,అక్షయ, తన్మాయి, రష్మిక తదితరులు పాల్గొన్నారు...



## కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా
### పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ అమలు

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు:**
కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద నేటి నుండి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్, యాక్ట్ `2023 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, అమలులో వుంటుందని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబందించిన ఉత్తుర్వులు గురువారంనాడు వెలువడ్డాయి. ఈ ఉత్తుర్వుల ప్రకారం పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు ఐదు వందల మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, మూసివేయాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని కరీంనగర్ పోలీసు కమిషనర్ తెలిపారు



## చిలుకూరులో సీఎం ప్లెక్సీలకు పాలాభిషేకం

**మండల కేంద్రంలో సీఎం, మంత్రుల ఫ్లెక్సీ లకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు**

**చిలుకూరు , ప్రభాత సూర్యుడుఛ**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టంపై అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని హర్షిస్తూ స్థానిక కాంగ్రెస్ మండల నాయకులు గురువారం చిలుకూరు బస్టాండ్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బీసీలకు న్యాయం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట రెడ్డి, నాయకులు పుల్లారావు, గంగిరెడ్డి ,కోడారూ బాబు, లింగయ్య, సొందుమియా, గన్న అశోక్, గండు వెంకటేశ్వర్లు ,రమేష్ పాల్గొన్నారు.




## ఉచిత పశు వైద్య ఉచిత శిబిరాన్ని ప్రారంభించిన కోదాడ వ్యవసాయ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ

**చిలుకూరు, ప్రభాత సూర్యుడు:**

మండల కేంద్రంలోని నారాయణపురం గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఉచిత కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మేగా పశువైద్య శిబిరాన్ని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని సుమారు 300 పశువు లకు వివిధ రకాల మందులు, వ్యాక్సిలను అందించడంతోపాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ బషీర్ , డైరెక్టర్ పోలంపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, చిలుకూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ వీరారెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ రాహుల్, వీరబాబు, ప్రభాకర్, మండవ.వెంకటేశ్వర్లు, తమ్మన బోయిన శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎల్ఆర్ఎస్ వసూళ్లలో పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరుగులు

- టాప్ 4 స్థానంలో పెద్ద అంబర్ పేట్ పురపాలిక
- 11 కోట్ల 23 లక్షల రూపాయల కలెక్షన్

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ స్కీం ముమ్మరంగా కొనసాగుతుంది. ఎల్ఆర్ఎస్ ఫీజుల వసూళ్లలో రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరుగులు పెడుతుంది . తెలంగాణ రాష్ట్రంలోనే 11 కోట్ల 23 లక్షల రూపాయల కలెక్షన్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు 1486 ప్లాట్లకు గాను 11.23 కోట్ల ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న 25% రాయితీ స్కీము చివరి గడువు మార్చి 31 వరకు ఉన్నందున మున్సిపాలిటీ పరిధిలోని ప్లాట్ల యజమానులు అందరూ ఈ స్కీమును సద్వినియోగం చేసుకొని తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు.

## హమాస్‌కు మద్దతుగా సోషల్ మీడియా ప్రచారం

**అమెరికాలో భారత విద్యార్థి బాదర్ ఖాన్ అరెస్ట్**

**వాషింగ్టన్, స్టేట్ బ్యూరో:**

పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్ తరపున సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలతో భారతీయ విద్యార్థి బాదర్‌ఖాన్ సూరిని అమెరికా భద్రతా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బాదర్ ఖాన్ వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో రీసెర్చర్‌గా ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వర్జినీయాలోని ఆయన నివాసం వద్ద ఫెడరల్ ఏజెంట్లు ఆయన్ని అరెస్టు చేశారు. ఆయన వీసాను కూడా రద్దు చేసినట్లు యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీస్ (డిహెచ్‌ఎస్) తెలిపింది. సోషల్ మీడియాలో హమాస్‌కు మద్దతు ప్రచారం చేయడంతో.. అతన్ని అదుపులోకి తీసుకున్నామని, ఆయన్ని భారత్‌కు పంపించే ప్రయత్నాలు చేస్తున్నట్లు డిహెచ్‌ఎస్ స్పష్టంచేసింది. కాగా, తన అరెస్టు, బహిష్కరణపై బాదర్‌ఖాన్ ఇమ్మిగ్రేషన్ కోర్టులో సవాల్ చేశారు. తన భార్య పాలస్తీనా మూలాలు ఉండడంతోనే అమెరికా ప్రభుత్వం ఈ చర్యలకు దిగిందని, తనకు ఎలాంటి నేర చరిత్ర లేదని బాదర్ ఖాన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. బాదర్‌ఖాన్ భారత్‌కు చెందిన వ్యక్తి. అయితే అతని స్వస్థలంకి సంబంధించిన వివరాలపై స్పష్టత లేదు. అయితే అతని విద్యాభ్యాసం భారత్‌లోనే గడిచినట్లు తెలుస్తోంది. న్యూఢల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీలో పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ స్టడీస్‌పైన పిహెచ్‌డి చేశారు. ఆ తర్వాత ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతిస్థాపనకు సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేశారు. అమెరికాకు వలస వెళ్లిన బాదర్.. మఫెజ్ అహమద్ యూసఫ్ అనే పాలస్తీనా మూలాలు ఉన్న అమెరికన్ పౌరురాలిని వివాహం చేసుకున్నారు. అయితే ఆమె తండ్రి హమాస్‌లో కీలక నేత అయిన అహ్మద్ యూసెఫ్‌గా డిహెచ్‌ఎస్ ప్రకటించింది.

## మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడకం నిషేధం

- కోరుట్ల ఇంచార్జీ మున్సిపల్ కమిషనర్ వి.రామకృష్ణ
- తడి పొడి హానికరమైన చెత్త, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై అవగాహన



**కోరుట్ల, ప్రభాతసూర్యుడు:**

120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడకం నిషేధం అని కోరుట్ల ఇంచార్జీ మున్సిపల్ కమిషనర్ వి.రామకృష్ణ తెలిపారు.
మున్సిపల్ కమిషనర్ వి.రామకృష్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛ `సర్వేక్షన్ 2024`25 లో భాగంగా గురువారం పట్టణ ప్రజలకు మున్సిపల్ అధికారులు పరిసరాల పరిశుభ్రత,తడి చెత్త పొడి చెత్త, హానికరమైన చెత్త, 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడకం నిషేధం పై అవగాహన కల్పించారు..ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, మీ ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి, తడి చెత్తను ఆకుపచ్చ రంగు డబ్బాలో,పొడి చెత్తను నీలిరంగు డబ్బాలో వేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వండి. తడి చెత్తను కంపోస్ట్ సెంటర్ కు తరలించి ఎరువుగా తయారు చేయటం జరుగుతుందని తెలిపారు .పొడి చెత్తను డి.ఆర్.సి.సి సెంటర్ కు తరలిస్తామని తెలిపారు.120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడకం నిషేధం అన్నారు. కావున పట్టణ ప్రజలు తమ ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి, హానికార చెత్తలుగా వేరు చేయుటకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.



## పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఫోటోకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**చిలుకూరు, ప్రభాత సూర్యుడు:**

మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఫోటోకు పాలాభిషేకం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఎం ఎస్ పి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వద్దేపల్లి కోటేష్ మాదిగ మాట్లాడుతూ సుదీర్ఘ 30 సంవత్సరాల పోరాటం మందకృష్ణ మాదిగ నాయకత్వం విజయం సాధించామని ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు సిద్దెల శ్రీను మాదిగ, చిలుకూరు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్లె పొంగు. సూరిబాబు మాదిగ, ముదిగొండ బాలు, కందుకూరి పెద్ద వెంకటేశ్వర్లు, పాపయ్య, అమరవరపు .శ్రీమన్నారాయణ, సిద్దెల పిచ్చయ్య, గజ్జి ప్రశాంత్ ,వీరస్వామి, వద్దేపల్లి వీరేశ, గజ్జి మాణిక్యం, ముదిగొండ వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

21.03.2025 శుక్రవారం
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక



## ఎడిటోరియల్



# బెట్టింగ్ మాఫియాలకు చెక్

ఒకర్ని చూసి మరొకరు. ఈజీ మనీ. ప్రమోషన్ చేసేద్దాం, పైసలు పట్టేద్దాం. ఇదీ గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో ఇన్ ఫ్లూయెన్సర్లు వ్యవహరిస్తున్న తీరు. తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ పుట్ట పగలడంతో చాలా మంది ఫోన్లు స్విచాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇంకొందరైతే.. తమకు తెలియకుండా చేశాం.. క్షమించాలంటూ వీడియోలు రిలీజ్ చేస్తున్నారు. ఇంకొందరు బెట్టింగ్ యాప్ ప్రమోషన్లు చేసినా చేయలేదని ఇంకా బుకాయించే పరిస్థితిలో ఉన్నారు.తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే. కొందరు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ఫేక్ ప్రమోషన్ చేసిన వారున్నారు. సక్సెస్ స్టోరీలంటూ కబుర్లు చెప్పిన వాళ్లున్నారు. లింకులు ఇచ్చి జాయిన్ అవ్వాలంటారు. ఫేక్ ప్రామిస్ లు కూడా చేస్తుంటారు. డబ్బులు గ్యారెంటీ నాది పూచీ అంటారు. సో ఇవన్నీ బెట్టింగ్ రొంపిలోకి దింపడమే. కేవలం మాటతో చెప్పకుండా అన్నీ ఫేక్ ప్రచారాలతో జనం నిండా మునిగేలా చేసిన వారెందరో. ఇప్పుడు వారందరి భరతం పట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. మోసపోయిన వారు, సామాజిక కార్యకర్తలు చాలా మంది కంప్లైంట్లు కూడా చేస్తున్నారు.బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సోషల్ ఇన్ ఫ్లూయెన్సర్లది ఒక తప్పైతే.. ఈ గేమింగ్ ను నడిపిస్తున్న వారిది మరో ఇష్యూ. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణలో బ్యాన్ ఉన్నప్పటికీ ఆయా వెబ్ సైట్ల వినియోగానికి ఇక్కడి ప్రజలను ఎలా అనుమతిస్తున్నారంటూ సంబంధిత వెబ్ సైట్ల నిర్వాహకులు, ఇంటర్నెట్ ప్రొవైడర్లను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇటీవలే నిలదీసింది. పలు బెట్టింగ్, గేమింగ్ కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. తెలంగాణలో నమోదైన ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, లోకల్ బ్యాంకు ఖాతా ఉన్న వ్యక్తులకు నిషేధిత గేమింగ్ సైట్లలో లాగిన్ అయ్యేందుకు అవకాశం ఎందుకిస్తున్నారని ప్రశ్నలు సంధించారుఇదీ గత కొన్ని రోజులుగా అందరినీ పోలీసులు అలర్ట్ చేస్తూ ఇస్తున్న మెసేజ్. ఎందుకంటే తెలుగు రాష్ట్రాల్లో సిచ్యువేషన్ చేయిజారిపోయింది. బెట్టింగ్ యాప్ లతో పరిచయం లేకపోయినా తాము ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫాంలలో ఫాలో అయ్యే వారు చెప్పుడు మాటలు విని జేబులు, ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. కొందరైతే అప్పుల పాలై వాటిని కట్టలేక ప్రాణాలు తీసుకున్నారు. ఇంకొందరైతే అప్పుల ఊబి నుంచి బయటపడలేకపోతున్నారు.సక్సెస్‌కు, సంపాదనకు షార్ట్ కట్స్ అంటూ ఏవీ లేవు. షార్ట్ కట్స్ లో వెళ్తే చివరకు మిగిలేది కష్టాలు, నష్టాలే. డ్రగ్స్, బెట్టింగ్స్ ఒకదానికొకటి ఇంటర్ లింక్. ఎలా ఉందో చూద్దాం అని ఒక్కసారి ముట్టుకుంటే వదిలి పెట్టవు. వ్యసనంగా మారుతాయి. చివరికి బానిసలుగా చేసుకుంటున్నాయి. ఫైనల్ గా నిండా ముంచేస్తాయి. జీవితాన్ని ఆగం చేస్తాయి. చక్కగా సంపాదించుకునే వారు కూడా చిన్న గేమ్ చిటికెలో ఆడేద్దాం, లక్షలు కోట్లు కొల్లగొడుదాం అనుకుంటున్నారు. చివరికి అన్నీ కోల్పోతున్నారు. ఆ భ్రమల నుంచి బయటపడేసరికి ఏమీ లేకుండా చేసుకుంటున్నారు. ఇదీ తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ మాయలో పడిన వారి దుస్థితి.సో ఇప్పుడు అసలు మ్యాటర్ ఏంటంటే నిషేధిత బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేసిన వారి భరతం పడుతున్నారు పోలీసులు. సబ్ స్క్రైబర్లు ఎక్కువగా ఉంటే చాలు.. ఒకరిని చూసి మరొకరు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ ఎవరు ఎటు మునిగితే మాకేంటి అనుకుంటూ వీడియోలు చేశారు. ఏపీ, తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ పై బ్యాన్ ఉంది. కానీ తమ ఫాలోవర్లను తెలివిగా ట్రాప్ చేసి టెలిగ్రామ్ గ్రూప్ లో చేరాలని చెప్పి.. అక్కడ నిషేధిత లింకులు వేస్తూ ఇన్ స్టాల్ చేసి ఆడిస్తూ.. డబ్బులు లేకపోతే మొదటగా ప్రమోషన్ గా కొంత ఇప్పిస్తూ రొంపిలోకి దింపి నిలువుదోపిడీ జరిగిపోయేలా చేస్తున్నారు. ఏదో ఒక రోజు పాపం పండుతుంది కదా.. ఇప్పుడు తెలుగు నాట బెట్టింగ్ యాప్స్ ఇష్యూ హాట్ డిబేట్ గా మారింది.లేటెస్ట్ గా 11 మంది యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అందరి సోషల్ మీడియా అకౌంట్లు చెకింగ్ నడుస్తోంది. డిలీట్ చేసినా సరే యూట్యూబ్, గూగుల్, ఫేస్ బుక్ కంపెనీలతో మాట్లాడి వాటిని రిట్రైవ్ చేయిస్తారు. ఆధారాలన్నీ సేకరించి చర్యలకు రెడీ అవుతున్నారు పోలీసులు. ఇమ్రాన్ ఖాన్ అనే యూట్యూబర్ ఎథిక్స్ లేని చెత్త వీడియోలు చేస్తున్నాడని పోలీసులు అంటున్నారు. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ల ముసుగులో ఏది చేస్తామన్నా కుదరదు అంటున్నారు. ప్రెజెంట్ కొందరు ఫోన్లు స్విఛాఫ్ చేసుకుని పరారయ్యారు. ఇంకొందరు అండర్ గ్రౌండ్ కు వెళ్లిపోయారు. కానీ ఎప్పటికైనా బయటకు రావాల్సిందే కదా. మొన్నటిదాకా లోన్ యాప్ లు, వేధింపులు, ఆత్మహత్యలు. ఇప్పుడు బెట్టింగ్ యాప్ ల గొడవ. చిన్నా చితకా ఇన్ ఫ్లూయెన్సర్లే ఈ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్నారని అనుకున్నారంతా. కానీ డీప్ గా వెళ్తే డీల్స్ అన్నీ డీకోడ్ అవుతున్నాయి. హీరోయిన్లు, సెలబ్రిటీలు, యూట్యూబ్ స్టార్లు ఒక్కరేమిటి చాలా మందికి బెట్టింగ్ మాఫియా లింకులు తెరపైకి వస్తున్నాయి. అంతా ఇల్లీగల్. అయినా సరే డబ్బులకు కక్కుర్తి పడి.. భయం లేకుండా ప్రమోట్ చేసేశారు. కానీ ఇప్పుడు అందరి మ్యాటర్ బయటికొస్తోంది. ఇల్లీగల్ బెట్టింగ్ యాప్స్ కామన పబ్లిక్ కు అందుబాటులో ఉండవు. వాటి పేర్లు కూడా చాలామందికి తెలియవు. ఎక్కడుంటాయి, ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నవి పబ్లిక్ డొమైన్ లో ఉండవు. జీజూస ఫైల్స్ రూపంలో, సైబర్ సెక్యూరిటీకి దొరక్కుండా ఫోన్లలోకి చొరబడేలా డీల్ చేస్తుంటారు. ఇవన్నీ ఇల్లీగల్ వ్యవహారాలను అరటిపండు ఒలిచినట్టు చెప్పేది ఈ ఘనత వహించిన సోషల్ మీడియా స్టార్లు, సెలబ్రిటీలే. కొందరు యూట్యూబ్ లో వెబ్ సిరీస్ లు రిలీజ్ చేసే వారు కూడా వీడియోకు ముందు ఇలాంటిదే పిచ్చి యాప్ ను పరిచయం చేసి రొంపిలోకి దింపుతుంటారు.గతంలో దగ్గుబాటి రానా ? ప్రకాష్ రాజ్ కలిసి ఆన్ లైన్ రమ్మీ యాడ్ లో నటించారు. ఈ యాడ్ ద్వారా ఈ ఇద్దరూ గ్యాంబ్లింగ్ ను ప్రోత్సహిస్తున్నారని కోయంబత్తూర్ కు చెందిన ఓ సామాజిక కార్యకర్త కేసు వేశాడు. అంతే కాదు అప్పట్లో ఈ ఇద్దరి తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు కూడా వచ్చాయి. ఇప్పుడు లేటెస్ట్ ఎపిసోడ్ తో మరోసారి విమర్శలు పెరుగుతున్నాయివీళ్లే కాదు గతంలో మంచు లక్ష్మి, హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్ ఇష్యూస్ తెరపైకి వస్తున్నాయి. వారందరిపైనా చర్యలు తీసుకోవాల్సిందే అని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసిన వారిలో యాంకర్ శ్యామల కూడా ఉండడంతో ఆమెను అధికార ప్రతినిధి పోస్ట్ నుంచి వైసీపీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు జనసేన నేత కిరణ్ రాయల్.ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్, పలు గేమింగ్ కంపెనీల సీఈఓలు, ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు, టెలికాం సర్వీసు ప్రొవైడర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం ప్రతినిధులతో ఇటీవలే మీటింగ్ కూడా పెట్టి స్ట్రిక్ట్ గా చెప్పేశారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు బానిసలై పలువురు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. గేమింగ్ సంస్థలు జియో ఫెన్సింగ్ పాటించకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. నిషేధిత గేమింగ్ యాప్‌ల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పిలుపునిచ్చింది.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు:** మానకొండూర్ నియోజకవర్గంలో అధికార విపక్ష పార్టీలు కాంగ్రెస్` బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అవినీతికి పాల్పడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించడంతో, ఆరోపణలు నిరూపించాలని కాంగ్రెస్ నేతలు బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. బెజ్జంకి అంబేద్కర్ విగ్రహం సాక్షిగా చర్చకు రావాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే అనుచరులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఆరు మండలాల నుంచి బెజ్జంకి కి బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. కొందరు బెజ్జంకి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని రసమయి రావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్` బీఆర్ఎస్ హంగామాతో పోలీసులకు ముచ్చెమటలు పట్టించారు. కొందరు రసమయి ఫామ్ హౌస్ వైపు దూసుకెళ్లడంతో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఓవైపు కాంగ్రెస్ కార్యకర్తలు మరోవైపు బిఆర్ఎస్ శ్రేణులు పరస్పర ఆరోపణలు విమర్శలతో ఆందోళన దిగడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు భారీగా మోహరించి ఎక్కడికక్కడ ఇరుపార్టీల నాయకులను కార్యకర్తలను అరెస్టు చేశారు.అధికారంలో ఉన్నప్పుడు అక్రమంగా కాలువ నీళ్ళను గుండారంలో నిర్మించుకున్న ఫామ్ హౌస్ కు రసమయి తరలించుకుపోయాడని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రసమయి తీరుపై ఆరు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పై చేసిన ఆరోపణలు నిరూపించకుంటే తరిమికొట్టక తప్పదని హెచ్చరించారు. బహిరంగ చర్చకు రాకుంటే ఫామ్ హౌస్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలో తిరగకుండా చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి తోపాటు బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ వైఖరిని ఎండ గట్టేందుకు సిద్ధం కాగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. బెజ్జంకి మండలం గుండారంలోని ఫామ్ హౌస్ లో ఉన్న రసమయిని గృహ నిర్బంధం చేశారు. కాంగ్రెస్ తీరు, ఎమ్మెల్యే వైఖరిపై రసమయి బాలకిషన్ ఆందోళన వ్యక్తం చేశారు. తాను చేసిన ఆరోపణలు నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని విచారణ జరిపిస్తే అన్ని బయటపడుతాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి 6 మండలాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు తన ఫామ్ హౌస్ పై దాడి చేసి తనను చంపేందుకు ఉసిగొలిపాడని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా మానకొండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మద్యం మాటల యుద్ధం కొనసాగుతుంది. చివరకు బహిరంగ చర్చకు సవాళ్ళ పర్వం ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరు పార్టీల శ్రేణులను అరెస్టు చేసిన పోలీసులు తాత్కాలికంగా ఆందోళనకు కట్టడి చేశారు. ఇరు పార్టీలు తగ్గేదేలేదంటు ఎంతటికైనా తెగించడంతో రాజకీయ పోరాటం ఎటువైపు దారి తీస్తుందోనని సర్వత్రా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.









# ఎయిర్ లైన్స్ లో ఇండిగో హవా

**5 లక్షల చేరువలో ఎయిర్ ట్రాఫిక్**

జీవితంలో ఒక్కసారి అయినా విమానం ఎక్కాలని చాలా మంది కోరుకుంటూ ఉంటారు. కానీ విమాన ప్రయాణం ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి చాలా మందికి అందనంత దూరంలో ఉంటుంది. మధ్య తరగతి ప్రజలను ఆకర్షించేందుకు ఎయిర్ లైన్స్ కంపెనీలు ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఇందుకోసం చాలా కంపెనీలు పలు రకాల వ్యూహాలను రచిస్తూనే ఉన్నాయి. సంపన్న దేశాల మాదిరి భారత్ లో ఎయిర్ లైన్స్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో భారత్ దూసుకుపోతుంది. ఇప్పటికే ప్రపంచంలో 4వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, ఈ దశాబ్దం చివరి నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నట్లు పలు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే మరోవైపు భారత విమానయాన రంగం కూడా గత పదేళ్ల కాలంలో బలమైన వృద్ధిని సాధించింది. ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్ గా భారత్ అవతరించింది. పదేళ్ల కిందట 5వ స్థానంలో ఉన్న డొమెస్టిక్ ఎయిర్‌లైన్ మార్కెట్ ఇప్పుడు మూడో స్థానానికి చేరుకుంది. పదేళ్ల కిందట భారత్ దాదాపుగా ఎనిమిది మిలియన్ల సీట్లతో 5వ డొమెస్టిక్ ఎయిర్ లైన్ మార్కెట్ గా ఉండేది. ఇండోనేషియా 4వ స్థానంలో, బ్రెజిల్ 3వ స్థానంలో ఉండేవి. అమెరికా, చైనాలు వరుసగా తొలి రెండుస్థానాలను ఆక్రమించుకున్నాయి. ప్రస్తుతం అమెరికా, చైనాల తర్వాత భారత్ మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్ గా అవతరించింది.బ్రెజిల్, ఇండోనేషియాలను దాటి ఏప్రిల్ 2024లో 15.6 మిలియన్ సీట్ల ఎయిర్‌లైన్ సామర్థ్యంలో మూడో స్థానానికి చేరినట్లు సంబంధిత శాఖ చేరుకుంది.

ప్రస్తుత విమానయాన మార్కెట్లో దేశీయ ఎయిర్ లైన్స్ సంస్థలు ఎంతెంత వాటా కలిగి ఉన్నాయో చూద్దాం.ఇండిగో 65.2శాతం, ఎయిర్ ఇండియా 25.7శాతం, అకాసా ఎయిర్ 4.7శాతం, స్పైస్ జెట్ 3.2శాతం, అలియన్స్ ఎయిర్ లైన్స్ 0.6శాతం, స్టార్ ఎయిర్ 0.4శాతం, ఫ్లై 91 0.1శాతం, ఇతర కంపెనీలు 0.1శాతంగా ఉన్నాయి.గత పదేళ్లో ఇండిగో దాని మార్కెట్ వాటాను రెట్టింపు చేసుకుంది. 2014లో 32 శాతం కెపాసిటీ నుంచి నేడు అది 62శాతానికి పెరిగింది. మిగిలిన మార్కెట్ కేవలం 0.7 శాతం మాత్రమే వృద్ధి చెందింది. అయితే ఇండిగోలో దేశీయ సామర్థ్యం వృద్ధి రేటు వార్షికంగా 13.9 శాతంగా ఉందని వెల్లడిరచింది. గతేడాది నవంబర్ 19న ఒక్కరోజులోనే భారత్‌లో విమానయాన సంస్థలు 4,56,910 మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చాయి. కోవిడ్ తర్వాత ఇదే అత్యధిక సింగిల్ డే ఎయిర్ ట్రాఫిక్. గత పదేళ్లలో దేశంలోని విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 157కి పెరిగింది.




# నేడు ప్రపంచ అటవీ దినోత్సవం

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహిస్తారు. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించబడిరది. ప్రస్తుత మరియు ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియజేయడంకోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం నవంబర్ 28, 2013న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం ద్వారా మార్చి 21వ తేదీన స్థాపించబడిరది. ప్రతి సంవత్సరం, వివిధ కార్యక్రమాలు జరుపుకుంటారు మరియు అన్ని రకాల అడవుల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతారు , మరియు ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం అడవుల వెలుపల చెట్లు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం రోజున అడవులు మరియు చెట్లతో కూడిన చెట్ల పెంపకం ప్రచారాలు వంటి స్థానిక, జాతీయ మరియు అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రయత్నాలను చేపట్టాలని దేశాలు ప్రోత్సహించబడ్డాయి. అడవులపై ఐక్యరాజ్యసమితి ఫోరమ్ యొక్క సెక్రటేరియట్ , సహకారంతోఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ , ప్రభుత్వాలు, అడవులపై సహకార భాగస్వామ్యం మరియు అంతర్జాతీయ, ప్రాంతీయ మరియు ఉపప్రాంతీయ సంస్థల సహకారంతో ఇటువంటి కార్యక్రమాల అమలును సులభతరం చేస్తుంది . అంతర్జాతీయ అటవీ దినోత్సవం మొదటిసారిగా మార్చి 21, 2013న నిర్వహించబడిరది.ప్రతి సంవత్సరం 13 మిలియన్ హెక్టార్ల (32 మిలియన్ ఎకరాలు) కంటే ఎక్కువ అడవులు పోతున్నాయి, ఈ ప్రాంతం దాదాపు ఇంగ్లండ్ పరిమాణంలో ఉంటుంది . అడవులు వెళ్ళినట్లే, అవి స్వీకరించే వృక్ష మరియు జంతు జాతులు కూడా వెళ్తాయి ` మొత్తం భూసంబంధమైన జీవవైవిధ్యంలో 80% . మరీ ముఖ్యంగా, వాతావరణ మార్పులో అడవులు కీలక పాత్ర పోషిస్తాయి. అటవీ నిర్మూలన వల్ల ప్రపంచంలోని 12`18 శాతం కార్బన్ ఉద్గారాలు ` ప్రపంచ రవాణా రంగం నుండి వచ్చే మొత్తం సీఓ 2 కి దాదాపు సమానం. అంతే కీలకమైన, ఆరోగ్యకరమైన అడవులు ప్రపంచంలోని ప్రాథమిక ‘ కార్బన్ సింక్‌లలో ‘ ఒకటి. నేడు, అడవులు ప్రపంచంలోని 30% కంటే ఎక్కువ భూమిని ఆక్రమించాయి మరియు 60,000 కంటే ఎక్కువ చెట్ల జాతులను కలిగి ఉన్నాయి, ఇంకా గుర్తించబడలేదు. ప్రపంచంలోని దాదాపు 1.6 బిలియన్ల పేద ప్రజలకు అడవులు ఆహారం, పీచు, నీరు మరియు ఔషధాలను అందిస్తాయి.

**పెండ్యాల రామ్ కుమార్, మంథని**

# ఆటోమొబైల్ మార్కెట్ ను శాసిస్తున్న భారత్

దేశంలో ఆటోమొబైల్ పరిశ్రమలో మారుతీ సుజుకీ అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ. ఇది ప్రధానంగా పేద మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని కార్లను విడుదల చేస్తుంది. ధర చాలా వరకు అందుబాటులో ఉంచడం దీని ప్రత్యేకత. అందుకే గత దశాబ్దాల కాలంగా కూడా మారుతీ అంటే ప్రజలకు ఎనలేని అభిమానం. కారు కొనాలని కోరిక ఉండి కొనలేక భాదపడుతున్న వారికీ మారుతీ తక్కువ ధరలోనే తన ప్రసిద్ధ మోడళ్లను అందిస్తూ సొంత కారు కలిగి ఉండాలనే కోరికను నెరవేర్చుతుంది. అమ్మకాల్లో ప్రతేడాది కూడా మొదటి స్థానంలో నిలవడం మారుతీకే చెందుతుంది. మార్కెట్లో చాలా కార్ల తయారీ కంపెనీలు ఉన్నప్పటికీ మారుతి సుజుకీ కార్లంటేనే మన దేశంలో చాలా మందికి ఇష్టం. సాధారణంగా ఏ రంగంలో అయినా పోటీ అనేది కామన్ గా ఉంటుంది. అయితే ఆటోమొబైల్ రంగంలో ఇది మరికాస్త ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఉత్పత్తి, ఆదాయం పొందడంలో ఎవరికీ వారు పోటీగానే ఉంటారు. ఆటోమొబైల్ రంగంలో ప్రధాన తయారీదారులుగా యూరోపియన్, అమెరికన్, జపనీస్, కొరియన్, చైనా దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమలో అగ్ర స్థానంలో ఉన్న టాప్ కంపెనీలను గురించి తెలుసుకుందాం.



**టయోటా :** జపాన్లో అత్యధికంగా 40శాతం మార్కెట్ షేర్ తో టయోటా కార్లే ఉంటాయి. కిచిరో టయోడా 1937లో దీన్ని స్థాపించారు. ప్రస్తుతం మన ఇండియాలో మారుతి సుజుకీ భాగస్వామ్యంతో కార్లను విక్రయిస్తుంది. మెర్సిడెస్ బెంజ్ : కాస్టీ కార్లకు పెట్టింది పేరు మెర్సిడెస్ బెంజ్. జర్మనీకి చెందిన కార్ల్ బెంజ్, గొట్టి లీబ్ డెయిమ్లర్ మెర్సిడెస్ బెంజ్ ను నెలకొల్పారు. 1926లో ఈ కంపెనీ ఉత్పత్తి చేసిన తొలికారు మార్కెట్లోకి వచ్చింది.

**బుగాటి :** లగ్జరీ కార్లను ఉత్పత్తి చేయడంతో దీనికి సాటి మరొకటి లేదు. 1909లో ఫ్రాన్స్కి చెందిన ఎట్టోర్ బుగాటి ఈ కంపెనీని ఏర్పాటు చేశారు. స్పోర్ట్స్ కార్లను ఈ సంస్థ ఉత్పత్తి చేస్తుంటుంది.

**బీఎండబ్ల్యూ :** సెలబ్రిటీలు కోరుకునే కారు ఇది. కార్ల్ రాప్, గుస్తోవ్ ఓట్టో 1916లో జర్మనీలో బీఎండబ్ల్యూ కంపెనీనీ స్థాపించారు. ఈ సంస్థ ప్రారంభంలో ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్లను తయారుచేసేది.

**లంబోరిని :** స్టేటస్ సింబల్ గా కార్లను వాడాలనుకునే వారు ఈ కంపెనీ కార్లను కొనుగోలు చేస్తుంటారు. లంబోర్గిని మెర్రుష్షియో 1963లో ఇటలీలో స్థాపించారు. లగ్జరీ కార్లను ఈ సంస్థ ఉత్పత్తి చేస్తుంటుంది.

**రోల్స్ రాయ్స్ :** 1906లో బ్రిటిష్కి చెందిన చార్లెస్ రోల్స్, హెన్రీ రాయ్స్ రూపొందించిన లగ్జరీ కార్ల కంపెనీ ఇది. వీరి పేర్ల మీదుగానే రోల్స్ రాయ్స్ అయ్యింది. ఈ కార్లు ధరకు తగ్గట్లే రాయల్ లుక్ ను కలిగి ఉంటాయి.

ఆడి : జర్మనీకి చెందిన ఆగస్ట్ హోర్స్ అనే వ్యక్తి 1909లో ఈ సంస్థను నెలకొల్పారు. ఫోక్స్ వాగన్ గ్రూప్ కు చెందిన సంస్థ ఇది.

**టెస్లా :** 2003లో మార్టిన్ ఎబహార్ట్, మార్క్ టార్పెన్నింగ్ కలిసి టెస్లాను స్థాపించారు. 2004లో ఎలాన్ మస్క్ టెస్లాలో పెట్టుబడిదారుడిగా చేరి 2008కి సీఈఓ స్థాయికి ఎదిగారు. ఇప్పుడు టెస్లా మస్క్ సొంతం.

**ల్యాండ్ రోవర్:** 1947లో జాగ్వార్ ల్యాండ్ రోవర్ అనే వ్యక్తి బ్రిటన్లో ఈ కంపెనీని స్థాపించారు. తొలి కారు 1948లో మార్కెట్లోకి వచ్చింది. 2008లో టాటా ఈ సంస్థని కొనుగోలు చేసింది.



# హరీష్ రావుపై కేసును కొట్టివేసిన హైకోర్టు

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టినమ కేసును హైకోర్టు కొట్టివేసింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో హరీష్ రావుపై 2024 డిసెంబర్లో కేసు నమోదు అయింది. ఎలాంటి ఆధారాలు లేకుండా, కనీసం విచారణ కూడా చేయకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారని, తనపై కుట్రపూరితంగా తప్పుడు కేసు నమోదు చేశారని హరీష్ రావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టులో సాగిన సుదీర్ఘ వాదనల అనంతరం హైకోర్టు గురువారం తుదితీర్పును వెలువరించింది. హరీష్ రావుపై నమోదు చేసిన కేసులో ఎలాంటి ఆధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిపక్షాలపై కక్ష సాధించడానికి కేసులతో వేధించాలనుకునే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది ఒక గుణపాఠమని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసారు.

21.03.2025 శుక్రవారం
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక

# 61 లక్షల ట్రావెల్ అలవెన్స్



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు: తెలంగాణ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇచ్చేందుకు జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సిద్ధమైంది. యూనివర్సిటీ నుంచి వాహన అద్దెకు తీసుకున్న నిధులపై అడిట్ విభాగం అభ్యంతరం తెలిపిది స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారని సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌ను అద్దె కారు వివాదం చుట్టుముట్టింది. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటికీ తన కారు అద్దె చెల్లింపు బిల్లులు పంపి డ్రా చేసుకున్నారని ఆడిట్‌లో తేలింది. కారుకు అద్దె పేరుతో యూనివర్శిటీ నుంచి రూ.61 లక్షల రూపాయలు బిల్లులు పెట్టి వసూలు చేసుకోవడంపై అభ్యంతరాలు మొదలయ్యాయి. ఇటీవల వర్శిటీలో నిధుల దుర్విని యోగం, అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోంది. ఈ విచారణలో స్మితా సభర్వాల్ కు రూ.61 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు అధికారులు.వాహన అద్దె కింద తీసుకున్న రూ.61 లక్షల నిధులను తిరిగి చెల్లించాలని మరో రెండ్రోజుల్లో ఆమెకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.2016 నుంచి 2024 వరకు సీఎంవో అదనపు కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్ 90 నెలలకు గాను వాహన అద్దె కింద రూ. 61 లక్షలు తీసుకున్నారు. ఈ నిధులపై అభ్యంతం వ్యక్తం చేసిన ఆడిట్ విభాగం...న్యాయ నిపుణుల సూచనల మేరకు ఆమెపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడిరచారు. స్మితా సభర్వాల్ తీసుకున్న కారు టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు. ఎల్లో ప్లేట్ వాహనం కూడా కాదు. ఈ వాహనం ప్రైవేటు వ్యక్తిగత వాహనం. పవన్‌కుమార్ పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో తేలింది. సీఎంవో ఉన్న సమయంలో స్మితా సభర్వాల్ కార్యాలయం నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో వర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది.ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పని తీరుపై తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ఇటీవల జరిపిన విచారణలో కొన్ని అవకతవకలు జరిగినట్టు తేలాయి. అందులో స్మిత సబర్వాల్ అద్దె కారు వ్యవహారం కూడా ఉంది. స్మితా సభర్వాల్ వాహనం అద్దెపై ఆడిట్ అభ్యంతరం చేయడం నిజమేనని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ తెలిపారు.ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ జరిపించామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో దీనిపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించనున్నామని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం, న్యాయ నిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నాయి.యూనివర్శిటీ అడిటింగ్ లో స్మితాసబర్వాల్ కు సంబంధించిన ఓ విషయం బయటపడిరది. స్మితా సబర్వాల్ నెలకు రూ.63 వేలు వాహన అలెవెన్స్ తీసుకున్నట్లు అడిట్ అధికారులు గుర్తించారు. యూనివర్శిటీ నుంచి వెహికల్ అలవెన్స్ కింద మొత్తం 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడంపై ఆడిట్ అధికారుల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై యూనివర్సిటీ బోర్డు మీటింగ్?లో అధికారులు చర్చించారు. స్మితా సబర్వాల్ వర్సిటీ నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి రాబట్టాలని బోర్డు మీటింగ్ లో నిర్ణయించినట్లు సమాచారం.ఈ విషయంపై ప్రభుత్వానికి రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదిక అందించనున్నారు. అనంతరం స్మితా సబర్వాల్? కు నోటీసులు జారీ చేసి నిధులు తిరిగి రాబట్టాలని వర్సిటీ అధికారులు యోచిస్తోన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో కీలక పదవుల్లో ఉన్న స్మితా సబర్వాల్ ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలు విషయంలో విచారణ ఎదుర్కొంటున్నారు. తాజాగా యూనివర్శిటీ నిధుల వ్యవహారంలో స్మితా సబర్వాల్ పేరు వినిపిస్తుంది.

# కీచక ప్రొఫెసర్ అరెస్ట్

విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఆరోపణలపై హత్రాస్ లోని సేథ్ ఫూల్ చంద్ బాగ్లా పీజీ కళాశాల చీఫ్ ప్రొక్టర్‌గా పనిచేస్తున్న రజనీష్ కుమార్ (50)ను పోలీసులు యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో అరెస్టు చేశారు. చాలా సంవత్సరాలుగా విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో అతడిని ప్రత్యేక పోలీసు బృందాలు గాలించి పట్టుకున్నాయి. పోలీసుల విచారణలో రజనీష్ కుమార్ నేరాన్ని అంగీకరించాడు. 2009లో ఒక విద్యార్థినిపై లైంగిక దాడి చేయగా, అది వెబ్‌కెమెరాలో రికార్డ్ అయిందని, ఆ తర్వాతే విద్యార్థినులను బ్లాక్‌మెయిల్ చేయాలనే ఆలోచన వచ్చిందని చెప్పాడు. పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేస్తానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి లంచాలు కూడా తీసుకున్నట్లు అంగీకరించాడు. మహిళలపై లైంగిక దాడి దృశ్యాలను రికార్డ్ చేసేందుకు తన కంప్యూటర్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా ఇన్‌స్టాల్ చేసుకున్నట్లు హత్రాస్ ఎస్పీ తెలిపారు. అతని వద్ద నుండి 65 వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. రజనీష్‌కుమార్ 1996లో వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం అతనికి పిల్లలు లేరు. 2001లో బాగ్లా కళాశాలలో అధ్యాపకుడిగా చేరి, గతేడాది చీఫ్ ప్రొక్టర్‌గా పదోన్నతి పొందాడు. ఈ కేసులో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎంతమంది విద్యార్థినులపై అత్యాచారం చేశాడో తెలియదని రజనీష్ పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి

నమోదు అయిన విషయం తెలిసిందే. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన రెండో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ తెలంగాణ హైకోర్టులో హరీష్ రావు, రాధాకిషన్‌రావు వేసిన పిటిషన్‌పై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీసులు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎఫ్ఐఆర్‌లో హరీష్‌రావుతో పాటు రాధాకిషన్‌రావును నిందితులుగా చేర్చారు. ఇప్పటికే ఇరు వాదనలు పూర్తవడంతో తీర్పును వెలువరించింది న్యాయస్థానం. ఇద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పును వెల్లడిరచింది. అధికారంలో ఉన్న సమయంలో తన ఫోన్‌ను ట్యాప్ చేసి.. తనను ఇబ్బందులకు గురిచేశారని.. వారి వల్ల తనకు ప్రాణహానీ ఉందంటూ రియల్ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ కొంతకాలం క్రితం మీడియాతో మాట్లాడారు. చక్రధర్ ఇచ్చిన సమాచారం, ఆయన ఇచ్చిన ఎవిడెన్స్‌ను ఆధారంగా చేసుకుని పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ అందులో సరైన ఆధారాలు లేవని హరీష్ రావు తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. హరీష్‌రావు, రాధాకిషన్ వాదనలతో ఏకభవించిన హైకోర్టు.. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.



# పాస్ బుక్కులు ఇచ్చేవరకు పోరాటం : సిపిఎం

అబ్దుల్లాపూర్ మెట్, ప్రభాత సూర్యుడు

భూములు కోల్పోయిన 125 మంది రైతులకు పాసు పుస్తకాలు ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదని సిపిఎం అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏర్పుల నరసింహ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని అనాజ్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన అనాజ్ పూర్ గ్రామ రైతులు ధర్నా చేశారు. గ్రామ సభలో తీర్మానం చేసి భూములు కోల్పోయిన 125 మంది రైతులకు పాస్ బుక్కులు ఇచ్చే విధంగా తీర్మానం చేయాలని కోరుతూ గ్రామ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పుల నరసింహ మాట్లాడుతూ.. గత రెండు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అధికారి అనంతరెడ్డికి కూడా వినతి పత్రాన్ని ఇచ్చామని, అందులో భాగంగానే నేడు స్థానికంగా భూములు కోల్పోయిన రైతులందరికీ తో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేశామని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ధరణి పేరుతో పాస్ పుస్తకాలు ఇవ్వకుండా అనాజ్ పూర్ గ్రామ రైతులను వేధింపులకు గురి చేస్తుందని, అధికారుల చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసిన ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన వారితో రైతులకు పాస్ బుక్కులు ఇచ్చేవరకు గ్రామంలోకి వచ్చిన ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధిని అడ్డుకొని నిలదీస్తామని, సమస్య పరిష్కారమయ్యే వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రైతుల పక్షాన సిపిఎం పార్టీ హెచ్చరించింది.



# లా అండ్ ఆర్డర్ అమలులో వనపర్తి జిల్లా ముందుండాలి

- ఆరోగ్యవంతమైన పోలీసు వ్యవస్థ ఎంతో అవసరం
- మెగా వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, ప్రభాతసూర్యుడు:

లా అండ్ ఆర్డర్ అమలులో వనపర్తి జిల్లా ముందుండాలని, ఆరోగ్య మంత్రమైన పోలీస్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.
గురువారం వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాపోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన కలెక్టర్, ఎస్పీలతో కలిసి ప్రారంభించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యవంతంగా ఉండాలని కోరుకుంటూ ఈ మెఘ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన జిల్లా పోలీస్ శాఖను ఆయన అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం, పోలీసు వైద్య సదుపాయాలపై, ప్రజా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారని అందుకు అనుగుణంగానే వనపర్తి జిల్లాకు 502 బెడ్డెడ్ హాస్పిటల్ ను మంజూరు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి జిల్లా ఆస్పత్రిలో అందించే వైద్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి?

## పలువురికి గాయాలు

మెదక్, ప్రభాతసూర్యడు:

పెద్ద శంకరంపేట (మం) కొలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సుని డిసిఎం ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు నారాయణమ్మ(50), సూరపమ్మ(60). మరో పదకొండు మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సులో ఉన్నవారంతా విజయనగరం వాసులుగా గుర్తించారు. వీరంతా తుల్జాపూర్ నుంచి శ్రీశైలం వెళ్తుండగా ఘటన జరిగింది.

# ఆవేర్ గ్లోబల్ ఆసుపత్రిలో టీబీ అవగాహన వారోత్సవం

ఎల్బీనగర్, ప్రభాతసూర్యడు:

ఎల్ బి నగర్ లోని గ్లీనీగల్స్ అవేర్ గ్లోబల్ ఆసుపత్రిలో టీబీ వ్యాధి అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ప్రపంచంలో సంవత్సరానికి కోటి పైగా ప్రజలు టీబీ వ్యాధిపై అవగాహన లేకపోవడం వలన వ్యాధి బారిన పడి మృతి చెందుతున్నారని, రెండు వారాల పాటు దగ్గు, ఉబ్బరం, ఆకలి కాకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే డాక్టర్ను సంప్రదించి సరైన పరీక్షలు చేయించుకోవాలి. ఆరు నెలలు ట్రీట్మెంట్ తీసుకుంటే నయమవుతుందని సూచించారు వైద్యులు. ,ముందస్తుగానే టీబీ వ్యాధి నివారణ చర్యలతో ప్రాణాపాయం ఉండదని తెలిపారు గ్లీనీగల్స్ అవేర్ గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు.

# శంషాబాద్లోని ఈకేఏఎం కన్వెన్షన్ హాల్లో అగ్ని ప్రమాదం

రంగారెడ్డి, ప్రభాతసూర్యడు:

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న ఈకేఏఎం కన్వెన్షన్ హాల్లో అగ్నిప్రమాదం. జరిగింది. మంటల ధాటికి పోగలు ఆకాశాన్ని అంటాయి. స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసారు.

# పర్వతాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద ఉద్రిక్తత

మేడ్చల్, ప్రభాతసూర్యుడు:

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పర్వతాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద ఉద్రిక్తత నెలకొంది. అసలైన లబ్ధిదారులు కాకుండా ఇతరులు వచ్చి తమ ఇండ్లలో ఉంటున్నారని ఇంటి పట్టాలున్న లబ్దిదారలు ఆగ్రహం వ్యక్తం చేసారు. అయితే డబుల్ బెడ్ రూంలో ఉండేవారు గతంలో 60 గజాల స్థలం పట్టాలు ప్రభుత్వం సుమారు 400 మంది కి ఇచ్చిందని బేస్ మెట్ నిర్మాణాలు కూలగొట్టి , మీకు డబల్ బెడ్ రూములు ఇస్తామని డబల్ బెడ్ రూమ్ లు నిర్మించారని అప్పటి రాజకీయ నాయకులు మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పై ఆరోపణలు చేస్తున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ.. తోపులాట, ఇరువర్గాలకు స్వల్ప గాయాలు అయ్యాయి. అడ్డుకున్న పోలీసులు ఇరువర్గాలని చదరగొట్టారు.

# పట్టణ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింతకుంట శ్రీకారం

పెద్దపల్లి, ప్రభాతసూర్యడు:

మున్సిపల్ పరిధిలోని 15 వ వార్డు చందపల్లిలో టియూఎఫ్ ఐడీసి ప్యాకేజి నెంబర్ ` 7 ద్వారా రూ. 35,60,000 నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభోత్సవం చేసుకున్న రోడ్డు పనులు గత వర్షాకాలంలో 15వ వార్డు ప్రజలు, స్కూల్ పిల్లలు, హాస్పిటల్ వెళ్లే వారు నడవాలంటే నడవలేని పరిస్థితి ఉండేదని తెలిపారు. త్వరలోనే సమస్య తీరనుందని పేర్కొన్నారు. కాగా ఈ నిధుల ద్వారా 500 మీటర్ల సిసి రోడ్డును ప్రారంభించుకోవడనీ జరిగిందని, అలాగే చందపల్లి నుండి తుర్కల మందికుంట వరకు ఇటీవలే బిటి రోడ్ పూర్తి చేసుకోగా దానికి లింక్ అయిన 500 మీటర్ల సీసీ రోడ్, బిటి రోడ్ సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. చందపల్లిలో దాదాపు మంచినీటి సరఫరా 90% పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 10% సరఫరా



ఏమైనా ఇబ్బంది ఉన్నట్లయితే పూర్తిగా మరమ్మతులు చేసి వేసవి కాలంలో మంచినీటి సరఫరా ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో దాదాపుగా 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నార. ఇప్పటివరకు 10 కోట్ల రూపాయలతో మురికి కాలువలు, సీసీ రోడ్లు పనులు పూర్తి చేసుకోవడం జరిగిందని, ఇంకా 20 కోట్ల రూపాయల పనులు పురోగతిలో ఉన్నాయని అవి కాకుండా 15 కోట్ల రూపాయల పనులను అంచనా వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పెండిరగ్ ఉన్నటువంటి పనులను అన్ని వార్డుల్లో పూర్తి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ , వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, తాజా మాజీ కౌన్సిలర్ నేతెట్ల స్వరూప కొమురయ్య, వెంకటేష్, శ్రీనివాస్, నూగిల్ల మల్లయ్య, సంపత్, శ్రీను, శంకరయ్య , ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, మాజీ కౌన్సిలర్లు,వార్డు ప్రజలు మున్సిపల్ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# బీదత్వం పోవాలంటే సమసమాజ నిర్మాణం కావాలి

- అట్టగుడు వర్గాల అభివృద్ధికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.
- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కేఎల్ఆర్

హైదరాబాద్, ప్రభాతసూర్యడు:

సమసమాజ నిర్మాణంతోనే అభివృద్ధి సాధ్యమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.
ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు, రాజీవ్ యువ వికాసం మూడు కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోనున్నాయని కిచ్చెన్న అన్నారు. తుక్కుగూడ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... అణగారిన వర్గాలను అన్ని రంగాల్లో రాణించేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు ఎస్సీ వర్గీకరణ, బీసీ 42శాతం రిజర్వేషన్ల బిల్లులకు చట్టబద్ధత కల్పించారని కొనియాడారు.
ఉన్నత చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఒక్క అగ్రవర్ణాలే కాకుండా అన్ని వర్గాలు రాణించేలా స్కిల్ యూనివర్శిటీని నెలకొల్పుతున్నామని లక్ష్మారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం తరపున సీఎం రేవంత్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలిపిన కేఎల్ఆర్... బీసీలకు రాజకీయాల్లోనూ 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన ఈ రెండు బిల్లులు...కేంద్రం ఆమోదించాలని కేఎల్ఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళానేతలు పాల్గొన్నారు

# క్రాస్ రోడ్స్ లో తీన్మార్ మల్లన్న

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు:**



తీన్ మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్. కాంగ్రెస్ పార్టీ నుంచి తాజాగా బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ. కులగణన సర్వేని బహిరంగంగా తగులబెట్టి అధిష్టానం ఆగ్రహనికి గురైన మల్లన్న, తేగేవరకూ లాగి చివరకు అధికార కాంగ్రెస్‌కు దూరమయ్యారు. కానీ ఎమ్మెల్సీ పదవికి మాత్రం రాజీనామా చేయబోనంటూ, అలా కంటిన్యూ అవుతున్నారు. ఇంతవరకూ అంతా బాగానే ఉంది. అయితే తాజా పరిణామాలు చూస్తుంటే ఈ ఎమ్మెల్సీ మల్లన్న, ఆ తీన్‌మార్ మల్లన్నేనా అనేంతలా పరిస్థితులు మారిపోయాయి. లేకా పరిస్థితులకు అనుకూలంగా మల్లన్న మారిపోయారా అనిపిస్తోంది ఆయనను దగ్గరగా గమనిస్తున్నవారికి. తాజాగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. మండలికి పంపిన బిల్లు సైతం ఆమోదం పొందింది. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే..ఏ కులగణన సర్వే తప్పుల తడక అంటూ రేవంత్ రెడ్డి సర్కార్‌పై దుమ్మెత్తిపోశాడో మల్లన్న, అదే కులగణన సర్వే ఆధారంగా బీసీలకు కేటాయించిన 42శాతం రిజర్వేషన్లకు మాత్రం మద్దతు తెలిపేశారు. బీసీ జనాభా సర్వేలో తగ్గించారు. లక్షల మంది బీసీలు, బతికున్న చనిపోయినట్లుగా సర్వేలో తప్పుడు లెక్కలు చూపించారు అంటూ రోజుల తరబడి ప్రచారం చేసిన మల్లన్నకు ఇప్పుడు ఏమైంది. కులగణన సర్వేపై ఆగ్రహంతో ఆ ప్రతులు కాల్చివేసి, బహిరంగంగా చేసిన విమర్శలే కదా మల్లన్నను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయ్యేలా చేసింది. జరిగిన నష్టం జరిగిపోయిన తరువాత ఇప్పుడు మళ్లీ సర్వే ఆధారంగా కేటాయించిన రిజర్వేషన్లపై మల్లన్న ఎందుకు మెత్తబడ్డారు. బీసీలకు మద్ధతుగా ఒక్క గొంతు అరచి గీపెట్టుకున్నా ఫలితం లేదు అనుకుని సర్దుకుపోయారా, లేక ఒకవేళ తాను బిల్లును వ్యతిరేకిస్తే ఎవరైతే తన బలంగా భావించి రాజకీయాల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నాడో అటువంటి బిసిలను దూరం చేసుకుంటే రాజకీయం మనుగడ కష్టమని భావించారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడిగింది ఎలాగో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇవ్వదు, ఇచ్చిన దానితోనే సర్దుకుపోదామని వెనక్కి తగ్గారు అనే వాదలు కూడా ఉన్నాయి. ఇలా మల్లన్న నాలుక మడతపెట్టడంపై రాజకీయ ప్రయోజనాలు ఎలా ఉన్నా...బిసిలకు వ్యతిరేకత లేకండా సేఫ్ గేమ్ అడుతున్నారని అర్ధమవుతోంది. తాజాగా కేటిఆర్‌ను మల్లన్న అసెంబ్లీ లాబీలో కలవడం పెనుదుమారం రేపింది. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నన్నాళ్లు రోజూ కేసిఆర్, కేటీఆర్,హరీష్‌రావు ఇలా గత ప్రభుత్వాన్ని తిట్టినతిట్టు తిట్టకుండా తన సోషల్ మీడియా వేదికపై దుమ్మెత్తిపోశారు మల్లన్న. ఆయన చేసిన ఆరోపణలు అన్నీఇన్నీ కాదు, ఒక్కమాటలో చెప్పాలంటే గత ప్రభుత్వం కూలిపోవడంలో మల్లన్న విమర్శలు సైతం కొంతవరకూ పని చేశాయి. ఇప్పుడు కేటీఆర్‌ను కలిసిన మల్లను చూస్తుంటే తీన్‌మార్ మల్లనేనా అనిపిస్తోంది. బిసి బిల్లుకు బిఆర్ఎస్ మద్ధతు కోరడంతోపాటు జంతర్‌మంతర్ దీక్షకు రావాలంటూ కేటీఆర్‌ను ఆహ్వానించడం, గతం గతః అన్నట్లు కేటీఆర్ సైతం నవ్వుతూ మల్లన్నతో మంతనాలు చేయడం చూస్తున్నవారు సైతం షాకైయ్యారు. బిఆర్ఎస్ మద్దతు ఎలాగో కాంగ్రెస్ కోరుతుంది. కానీ పని గట్టుకుని మల్లన్న కేటీఆర్‌ను కలవడం చూస్తుంటే బిఆర్ఎస్‌కు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారా అనే టాక్ కూడా వినిపిస్తో?ంది. ఇదిలా ఉంటే మల్లన్న తాజాగా వ్యహరిస్తున్న తీరుపై అనేక సందేహాలు లేకపోలేదు. రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన మల్లన్న ఉన్నట్లుండి ఎందుకిలా మారిపోయారు. బిఆర్ఎస్‌ను పొట్టుపొట్టున తిట్టి, రేవంత్కు జాన్ జిగిరి అయ్యాడు. మరి ఉన్నట్లుండి ఇలా రేవంత్‌కు రామ్‌రామ్ చెప్పి బిఆర్ఎస్ నేతలతో మంతనాలు చేయడానికి అంత వ్యక్తిగత కారణాలు లేవు. అలా అని బిసిల కోసమే అంటే ఇప్పడు ఇచ్చిన రిజర్వేషన్‌తో సరిపెట్టకుంటూ సై అంటున్నారు. ఇలా ఇవన్నీ చూస్తుంటే రేవంత్ రెడ్డి చెప్పినట్లు మల్లన్న పొలిటికల్ గేమ్ ఆడుతున్నారు అందుకే కటీఫ్ చెప్పినట్లే చెప్పి, కార్యాచరణ మాత్రం అమలు చేస్తున్నారానే విమర్శలు వినిపిస్తున్నాయి



## వరల్డ్ హెడ్ ఇంజూరీ డే సందర్భంగా రెనే హాస్పిటల్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు:**

"ప్రపంచ తల గాయాల అవగాహన దినం"ను పురస్కరించుకొని రెనే హాస్పిటల్, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో బైక్ ర్యాలీనీ నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్కరికీ రోడ్డు ప్రమాదాల వల్ల తలకు బలమైన గాయాలు కావడం వల్ల నేడు దేశంలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం లేదా శాశ్వత అంగ వైకల్యంతో నిండు జీవితాలు కోల్పోవడం జరుగుతోంది. కేవలం హెల్మెట్ ధరించడం ద్వారా తలకు ఎటువంటి గాయాలు కాకుండా ఉండొచ్చని ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలని, ప్రతి ఒక్కరికీ హెల్మెట్ ధరించడం పట్ల అవగాహన పెంపొందించాలన్న ఒక సదుద్దేశ్యంతో ఈ ర్యాలీ నిర్వహించడం జరిగింది.

ఈ బైక్ ర్యాలికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ ఏసిపి వెంకట్ స్వామి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ బైక్ నడిపే ప్రతి క్షణం లేదా పిలియన్ రైడర్‌గా ప్రయాణించే సందర్భంలో విధిగా హెల్మెట్ ధరించాలని, మన కుటుంబం కోసమైనా ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. ఈ బైక్ ర్యాలిని రెనే హాస్పిటల్ నుండి ప్రారంభించి ఈ ర్యాలీ మంచిర్యాల చౌరస్తా, గాంధీ రోడ్డు, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, బస్ స్టాండ్ ద్వారా గీతా భవన్ వద్ద గల తెలంగాణా చౌక్ వద్దకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ గౌస్ అలాం చేతుల మీదుగా సుమారు 200 మంది మున్సిపల్ కార్మికులు, అంబులెన్స్ డ్రైవర్లు, పోలీస్ సిబ్బందికి ఉచితంగా హెల్మెట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపి గౌస్ అలాం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది తల గాయాల కారణంగా ప్రాణాలను కోల్పోతున్నారు.తల గాయాలు అనేవి కేవలం వ్యక్తిగత సమస్యలు కాదు... ఇవి కుటుంబాలను, సమాజాన్ని ప్రభావితం చేసే గొప్ప సమస్య అని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. రెనే హాస్పిటల్స్ అధినేత ప్రొఫెసర్ డా.బంగారి స్వామి మాట్లాడుతూ తన వైద్య వృత్తిలో చాలా వరకు ప్రమాదాలు జాగ్రత్తలు పాటించక పోవడం వల్లనే జరిగాయని, ఒక రోడ్ ప్రమాదం జరగడం వల్ల కేవలం ప్రత్యక్షంగా ఒక వ్యక్తి గాయపడడం లేక చనిపోవడం మాత్రమే జరుగుతోందని అందరు అనుకుంటారు అని కానీ ఒక కుటుంబం మొత్తం ప్రభావితం అవుతుందని చిన్న తనంలోనే తల్లితండ్రులను కోల్పోయే పరిస్థితి, సరైన సమయంలో కుటుంబానికి అంది వచ్చే వయసున్న సంతానాన్ని కోల్పోయే తల్లితండ్రులను తన కెరీర్ లో ఎంతో మందిని చూశానని అన్నారు. కేవలం వాహనం నడిపేవారే కాక వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, ఒక వేళ కార్ లో వెళితే తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. వాహనం అనేది సుఖవంతమైన ప్రయాణానికి మాత్రమే అని వేగమంతమైన ప్రయాణానికి కాదు అనే ఈ ఒక్క విషయం అందరు తప్పకుండా గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రెనే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ ఇన్ఫర్టిలిటి స్పెషలిస్ట్ డా.బంగారి రజనీ ప్రియదర్శిని, వన్ టౌన్ సిఐ కోటేశ్, టూ టౌన్ సిఐ సృజన్ రెడ్డి, త్రీ టౌన్ సిఐ జాన్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ పర్స రమేష్ , రెనే హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్రా చారి, గుండె వైద్య నిపుణులు డా.దినకర్, సీనియర్ ఫీజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, డీన్ డా. మునీష్, డా.కృష్ణా రెడ్డి, డా. లతీశ్ రెడ్డి, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి ఘన్ శ్యామ్, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డా.బుర్ర మధుసూదన్ రెడ్డి, తెలంగాణా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ జనార్ధన్ రెడ్డి , తుమ్మల రమేష్ రెడ్డి, ?ాఖీ శేఖర్, లతో పాటు సుమారు 300 మంది హెల్మెట్ ధరించిన బైక్ రైడర్ పాల్గొన్నినగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



## రైతు పోలాలు ఎండిపోకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలి

- నీటి కాల్వల వద్ద అవసరమైన చర్యలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ప్రభాతసూర్యుడు:**

జిల్లాలో ఎస్సారెస్పీ క్రింద యాసంగి పంట పొలాలు సరఫరాకు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష డీ` 83 కాల్వ క్రింద యాసంగి పంటకు నీటి విడుదల పై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాల్వ క్రింద యాసంగి పంట కింద 7 తడులలో 6 తడుల నీటిని ఇప్పటికే విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు గణనీయం గా పెరిగిపోవడం, ఎస్సారెస్పీ నుంచి ఆశించిన స్థాయిలో నీరు విడుదల కాకపోవడం, ఎండ తీవ్రత వల్ల ఆవిరిలో కొంత నీరు నష్టపోవడం వంటి కారణాలవల్ల చివరి ఆయ కట్టు ప్రాంతాల్లో పంట పొలాల కు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని అన్నారు.ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న నీటి నిల్వలను జాగ్రత్తగా వినియోగించు కోవాలని, ఎస్సారెస్పీ కాల్వల పై ఎక్కడా నీటి వృథా కాకుం డా చర్యలు తీసుకోవాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారు లకు సూచించారు. కాల్వలపై అవసరమైన చోట తగు చర్యలు తీసుకుంటూ నీటిని విడుదల చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను సంబంధిత అధికారులను తెలుసుకొని వారికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, మంథని ఈ ఈ బాల రామయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 37మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- శాఖల సమన్వయంతో నిర్వాసితులకు న్యాయం చేస్తూ భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి
- మున్నేరు రిటైనింగ్ వాల్ భూసేకరణ, నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, ప్రభాతసూర్యుడు:**

మున్నేరు నది కిరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన భూ సేకరణతో పాటు, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పోలేపల్లి వద్ద మున్నేరు పై జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, రిటైనింగ్ వాల్ కొరకు భూసేకరణ పురోగతి, మున్నేరు భూ నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చే స్థలం, మున్నేరు యాక్విడేట్ ను పరిశీలించారు. రోజువారి ఎంత మేరకు పని జరగాలో ప్రణాళిక చేసి, కార్యాచరణ చేయాలని, పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసుకొని, వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పరిస్థితులకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల మ్యాప్ లను పరిశీలించి, వరదలు వస్తే ఎంత మేరకు నీరు చేరుతుంది, అధికంగా ఫోర్స్ తో నీటి ప్రవాహం వచ్చినప్పుడు తట్టుకునేందుకు రిటైనింగ్ వాల్ లో నాణ్యత, నిర్మాణంలో మెటీరియల్, వాల్ క్యూరింగ్ విషయాలలో పాటించాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ అధికారులకు, గుత్తేదారులకు వివరించారు. రిటైనింగ్ వాల్ ప్రక్కన మున్నేరు ఉన్నది అనే ఆనవాళ్ళు పోకుండా నిర్మాణంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎక్కువ మొత్తంలో వరద వచ్చిన కూడా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రవాహ సామర్థ్యం అంచనాతో శాస్త్రీయంగా నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మున్నేరు వాల్ కు ఆనుకొని రోడ్డు, రోడ్డు ప్రక్కన డ్రైనేజీ కాలువ నిర్మిస్తున్నామని అన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమిని ఇచ్చి, భూసేకరణ చేసేలా అధికారులు రైతులతో చర్చలు జరుపుతున్నారని అన్నారు. భూనిర్వాసితులకు అభివృద్ధి చేసిన భూములు ప్రత్యామ్నాయంగా అందించి త్వరగా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ పూర్తి చేస్తామని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి పనుల పురోగతి పై రోజువారి నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి సేకరించాల్సిన ప్రైవేట్ భూముల యజమానులతో చర్చించి సదరు భూములను వెంటనే స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఇ యం. వెంకటేశ్వర్లు, డి.ఇ. రమేష్, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్.ఐ. క్రాంతి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులే కేంద్రంగా విద్యా బోధన జరగాలి

**జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి**

**కోహెడ, ప్రభాతసూర్యుడు:**

కోహెడ మండలకేంద్రంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. 50 లక్షల రూపాయలతో శనిగరం, కోహెడ, అంతక్కపేట జెడ్పి హై స్కూల్ లలో ల్యాబ్ ను ఏర్పాటు చేసేందుకు సహకరించిన టిఎస్ ఐజీ డైరెక్టర్ అర్చన సురేష్, సేల్స్ ఫోర్సెస్ సంస్థ ప్రతినిధి కిరణ్మై, నిర్మాన్ ఎన్జీఓ ప్రతినిధి మధురీ కనకాల లకు ధన్యవాదములు. విజ్ఞాన్నాన్ని అందించడంలో వార్త పత్రికలు ముందుంటాయని ప్రతిరోజూ ఒక తెలుగు లేదా ఇంగ్లిష్ వార్త పతికాను ప్రతిరోజూ కనీసం 15 నిముషాలు చదువాలని, మీరు చెప్పదలుచుకున్నది ఏ భాషలోనైనా కాన్ఫిడెన్స్‌గా చెప్పాలని, మీరు చెప్పే దానిని బట్టి మీ వ్యక్తితత్వాన్ని అంచనా వేస్తారని విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎక్కువగా స్టేజ్ మీద మాట్లాడిరచాలని, విద్యార్థులతో స్టేజ్ మీద మాట్లాడిస్తే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని, విద్యార్థులు కేంద్రంగా విద్యా బోధన జరుగాలని ఉపాధ్యాయులకు సూచించారు. నేడు ప్రారంభమవుతున్న 10 వ తరగతి పరీక్షల పరీక్షలలో అందరు పాసై 10 జీపి సాధించాలని పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మా జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ నాలెడ్జ్ అందించడంతో సహకారం కోరడంతో సేల్స్ ఫోర్సెస్ మరియు నిర్మాన్ ఎన్జీఓ ల సహకారంతో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, కోహెడ తహసీల్దార్ సురేఖ, ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రామస్వామి, ఎంఈఓ పద్మయ్య, పాఠశాల హెచ్ఎం, నిర్మాన్, సేల్స్ ఫోర్సెస్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు కిరణ్మై, మాధురి, పాఠశాల, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో స్నేహ సంబంధాల మెరుగు పడతాయి

- మానసికోల్లాసానికి దోహదం
- శరీర దారుడ్యానికి క్రీడలు ఎంతో అవసరం.
- ప్రీమియర్ లీగ్ సీజన్ 2 పోటీలు ప్రారంభించిన ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య

**తాండూర్. ప్రభాతసూర్యుడు:**

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడటంతో పాటు శరీర దారుడ్యానికి ఎంతో అవసరమని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్,మాదారం ఎస్సై సౌజన్యలు అన్నారు. గురువారం రోజున సర్కిల్ కార్యాలయం ఆవరణలోని క్రీడ ప్రాంగణంలో తాండూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 పోటీలను ప్రారంభించి అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటి తరం యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మానసిక ఉల్లాసం కోసం ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని ఓడిన వారు నిరుత్సాహపడకుండా విజయం వైపుకు పయనించాలన్నారు.క్రీడ ప్రాంగణంలో అందరూ క్రీడాకారులు స్నేహితుల్లాగా కలిసిమెలిసి ఆటలను ప్రదర్శించుకోవలన్నారు.ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ముగింపు రోజున మొదటి బహుమతి 40000 నగదు తో పాటు మెమొంటో రెండవ బహుమతి 20వేల తో పాటు మెమొంటో అదేవిధంగా ఈ పోటీల్లో ప్రదర్శించిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాసాడి శశివర్ధన్, మైదనీ అనిల్ ,శివ ,అనుదీప్ రాజు, సహన కిరణ్, శ్రీధర్ ,సల్మాన్ ఖాన్, ప్రమోద్, వెంకటస్వామి తోపాటు బిజెపి సీనియర్ నాయకులు చిలువేరి శేషగిరి లు పాల్గొన్నారు.





## హైడ్రా అధికారుల కొరడా

**తుర్క యాంజాల్ , ప్రభాత సూర్యుడు :**

రంగారెడ్డి జిల్లా తుర్క యాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణలపై హైడ్రా అధికారులు కొరడా జూలిపించారు. కొందరు అక్రమార్కులు మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువులో అక్రమంగా వేసిన రోడ్లను పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా అధికారులు రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి తొలగించారు. రెండు రోజుల క్రితం స్థానిక శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి అసెంబ్లీలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులను కబ్జా చేస్తూ అక్రమంగా రోడ్లు వేస్తున్నారని ప్రస్తావించడం, ఇదే విషయంపై హైడ్రా అధికారులకు గతంలోనే ఫిర్యాదులు రావడంతో ఇరిగేషన్, రెవిన్యూ, హెచ్ఎండిఏ అధికారులతో పరిశీలించిన హైడ్రా, మాసబ్ చెరువు ఆక్రమణకు గురైందని నిర్ధారించుకున్న హైడ్రా అధికారులు గురువారం జెసిబిల సహాయంతో రోడ్లను తొలగించారు.

ప్రభాత సూర్యుడు
21.03.2025 శుక్రవారం
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక



# హెచ్ సీఏలో భారీ అవినీతి..

## రూ.90లక్షలకుపైగా నిధుల దుర్వినియోగం

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ)లో భారీ అవినీతి జరిగింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియానికి సంబంధించి కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో జరిగిందని తాజాగా ఈడీ జరిపిన విచారణలో తేలింది. రూ.90లక్షలకుపైగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తోంది. అప్పటి హెచ్ సీఏ వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్ సురేందర్ అగర్వాల్ కుటుంబంతో ఈ కుంభకోణానికి సంబంధాలు ఉన్నట్లు తేలింది. క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీల కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో జరిగినట్టు గుర్తించింది. కాంట్రాక్ట్ కంపెనీల నుంచి సురేందర్ అగర్వాల్ కుటుంబ సభ్యుల అకౌంట్లకు మనీలాండరింగ్ జరిగినట్టు ఆధారాలు గుర్తించింది. దీంతో సురేందర్ అగర్వాల్, ఆయన భార్య, కొడుకు, కోడలికి చెందిన రూ.51.29 లక్షల విలువైన ఆస్తులను సీజ్ చేసింది. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ ఆఫీస్ తాజాగా ప్రకటన వెలువరించింది. భారత మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో వైస్ ప్రెసిండెంట్, ట్రెజరర్‌గా సురేందర్ అగర్వాల్ వ్యవహరించారు. వీరి హయాంలో 2019%%2022 సంవత్సరాలకు గాను బీసీసీఐ నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అవసరమైన క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీలు, అగ్నిమాపక పరికరాలు పర్చేజ్ చేశారు. అయితే ఈ నిధుల్లో భారీగా అక్రమాలు జరిగినట్టు అప్పటి ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్ట్‌లో వివరాలు బయటకు వచ్చాయి. దీంతో 2023 అక్టోబర్‌లో హెచ్‌సీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉప్పల్ పోలీసులు నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఈడీ.. మనీలాండరింగ్ కోణంలో నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేసి, వివరాలు సేకరించింది. ఉప్పల్ స్టేడియానికి పరకరాల సప్లయ్ చేసేందుకు సారా స్పోర్ట్స్, ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్, బాడీ డ్రెంచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చారు. సాధారణం కంటే కుట్రపూరితంగా అధిక ధరలతో లావాదేవీలు నిర్వహించడంతో, ఇలా అక్రమంగా వచ్చిన లాభాలు ఆయా కంపెనీల నుంచి సురేందర్ కుటుంబ సభ్యులకు బదిలీ అయ్యాయి. సురేందర్ భార్య పేరుతో ఉన్న కేబీ జ్యువెలర్స్‌కు, ఆయన కొడుకు అక్షిత్ అగర్వాల్ వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లకు సారా స్పోర్ట్స్ అకౌంట్ నుంచి రూ.17 లక్షలు జమ అయ్యాయి. అలాగే మరో సంస్థ ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా అక్షిత్ అకౌంట్‌కు రూ. 21.86 లక్షలు డిపాజిట్ అయ్యాయి. అలాగే బాడీ డ్రెంచ్ ఇండియా అకౌంట్ నుంచి రూ. 52 లక్షలు బదిలీ అయ్యాయని దర్యాప్తులో తేలింది. ఇలా క్విడ్ ప్రో కో విధానంలో సురేందర్ కుటుంబ సభ్యులకు మొత్తం రూ. 90.86 లక్షలు చేరినట్టు ఆధారాలు సేకరించింది. దీని అధారంగా కేసు నమోదు చేసిన ఈడీ, దర్యాప్తు చేస్తోంది. అయితే తాజాగా ఈ కుంభకోణంపై క్రికెట్ ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దేశవాళీలో హైదరబాద్ జట్టు ఆటతీరు అంతంతమాత్రమేనని, ఇక ఇలాంటి కుంభకోణాలతో అటు హైదరాబాద్, ఇటు తెలంగాణ పరువు మంట కలిసిందని వాపోతున్నరు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐపీఎల్ 2025 సీజన్‌కు రంగం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుంది. ఆదివారం ఉప్పల్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ టైటిల్ వేటను ప్రారంభించనుంది. గతేడాది తృటిలో టైటిల్ చేజార్చుకొని రన్నరప్‌గా నిలిచిన ఆరెంజ్ ఆర్మీ.. ఈసారి విజేతగా నిలవాలనే పట్టుదలతో ఉంది. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలంతో టీమ్ బలహీనతలను అధిగమించిన సన్‌రైజర్స్.. పేపర్‌పై భీకరంగా కనిపిస్తోంది. ఇప్పటికే జట్టు ఆటగాళ్లంతా హైదరాబాద్ చేరి ముమ్మరంగా సాధన చేస్తున్నారు. తొలి మ్యాచ్ నుంచే సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ అత్యుత్తమ జట్టును బరిలోకి దించనుంది. ఐపీఎల్ 2025 మెగా వేలం నేపథ్యంలో జట్టులో భారీ మార్పులు చోటు చేసుకోవడంతో టీమ్ కాంబినేషన్ ఎలా ఉంటుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వేలానికి ముందే కోర్ టీమ్ సభ్యులను రిటైన్ చేసుకోవడం ఆరెంజ్ ఆర్మీకి కలిసొచ్చే అంశం. వేలానికి ముందే అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌లను సన్‌రైజర్స్ రిటైన్ చేసుకుంది. గత సీజన్‌లో ఈ ఇద్దరూ పరుగుల విధ్వంసం సృష్టించారు. జట్టుకు అదిరిపోయే ఆరంభాలను అందించారు. ఈ క్రమంలోనే ఈ జోడీనే మరోసారి సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. జట్టులోకి కొత్తగా వచ్చిన ఇషాన్ కిషన్ ఫస్ట్ డౌన్‌లో ఆడనున్నాడు. అయితే టాప్-3 బ్యాటర్లు లెఫ్టాండర్సే కావడం సన్‌రైజర్స్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం ఆలోచిస్తే టాప్-3 బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయవచ్చు.మిడిలార్డర్‌లో తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డితో పాటు హెన్రీచ్ క్లాసెన్, అభినవ్ మనోహర్ బరిలోకి దిగనున్నారు. గతేడాది నితీష్, క్లాసెన్ అద్భుత ప్రదర్శన కనబర్చారు. అభినవ్ మనోహర్ కూడా చెలరేగితే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తిరుగుండదు. అభినవ్ మనోహర్‌కు ఫినిషర్‌గా గుర్తింపు ఉంది. ఆస్ట్రేలియా స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపాకు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు లేవు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, అభినవ్ మనోహర్‌లు స్పిన్ బౌలింగ్ చేయగలరు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా రాహుల్ చాహర్ బరిలోకి దిగనున్నాడు. ఈ క్రమంలోనే బ్యాటింగ్ డెప్త్ కోసం పేస్ ఆల్‌రౌండర్ అయిన వియాన్ మల్డర్‌ను ఆడిరచే అవకాశం ఉంది. ఉప్పల్ మైదానం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనున్ననేపథ్యంలో సన్‌రైజర్స్ బ్యాటింగ్ ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యత ఇవ్వనుంది. స్పిన్నర్ కావాలని భావిస్తే వియాన్ మల్డర్ స్థానంలో ఆడమ్ జంపా బరిలోకి దిగుతాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ పేస్ విభాగాన్ని ప్యాట్ కమిన్స్‌తో పాటు మహమ్మద్ షమీ, హర్షల్ పటేల్ నడిపించనున్నారు. ఈ ముగ్గురికి నితీష్ కుమార్ రెడ్డి అండగా నిలవనున్నాడు. వియాన్ మల్డర్ బరిలోకి దిగితే అతను కూడా పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు. షమీ ఫిట్‌నెస్‌పై సందేహాలున్నాయి. బౌలింగ్‌లో కమిన్స్‌తో పాటు షమీ రాణిస్తే ఆరెంజ్ ఆర్మీకి తిరుగుండదు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా రాహుల్ చాహర్ ఆడనున్నాడు. అయితే సన్‌రైజర్స్ జట్టులో 11 మంది బ్యాటర్లకు బ్యాటింగ్ చేసే సామర్థ్యం ఉండటం కలిసొచ్చే అంశం. ఇంపాక్ట్ ప్లేయర్లుగా సమర్జిత్ సింగ్, సచిన్ బేబీలు ఆడనున్నారు.




# రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ కు జంపాకు నో ఛాన్స్!




# సీఎస్‌కేను మరో రెండేళ్లు నిషేధించండి! చెన్నై జట్టు అభిమానుల డిమాండ్

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఫ్రాంచైజీని మరో రెండేళ్ల పాటు నిషేధించాలని ఆ జట్టు అభిమానులే డిమాండ్ చేస్తున్నారు. ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ.. టికెట్ల విషయంలో అభిమానులను దారుణంగా మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. టికెట్లను అధిక ధరలకు విక్రయించడమే కాకుండా.. సగం టికెట్లను మాత్రమే ఆన్‌లైన్‌లో పెట్టారని మండిపడుతున్నారు.ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మార్చి 23 (ఆదివారం)న చెపాక్ మైదానం వేదికగా ముంబై ఇండియన్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల అమ్మకాలు బుధవారమే ప్రారంభమయ్యాయి. చెన్నై చెపాక్ స్టేడియానికి 40 వేల సీటింగ్ కెపాసిటీ ఉండగా.. ఇందులో 35వేలకు పైగా టికెట్లను ఆన్‌లైన్ ద్వారా విక్రయించాలి.అయితే ఆన్‌లైన్‌లో రిలీజ్ చేసిన క్షణాల్లోనే టికెట్లన్నీ అయిపోయాయి. టికెట్ల కోసం గంటలకొద్దీ ఆన్‌లైన్ వేదికగా వేచి ఉన్నా.. దొరకలేదని, అసలు టికెట్లు ఆన్‌లైన్ ద్వారా అమ్మడం లేదని సీఎస్‌కే ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. స్టేడియంలోని సగం టికెట్లను తెలిసిన వారికే ఇస్తున్నారని, మరికొన్ని బ్లాక్‌లో అమ్ముతున్నారని ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. 40 వేల టికెట్లు మాత్రమే ఉండగా.. ఈ మ్యాచ్ కోసం రెండు లక్షల యాభై వేల మంది వేచి చూసినట్లు గణంకాలు చెబుతున్నాయి. చెన్నైలో ధోనీకి ఫుల్ క్రేజ్ ఉండటంతో పాటు ముంబై ఇండియన్స్ తరపున రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ బరిలోకి దిగుతుండటం కూడా టికెట్లను డిమాండ్‌ను అమాంతం పెంచినట్లు తెలుస్తోంది.చెపాక్ స్టేడియంలో కనీస టికెట్ ధరనే రూ. 1400గా ఉండగా.. బ్లాక్‌లో ఒక్కో టికెట్‌ను 10 రెట్లు పెంచి అమ్ముతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే చెన్నై సూపర్ కింగ్స్‌ను మరో రెండేళ్ల పాటు నిషేధం విధించాలని సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. గతంలో స్పాట్ ఫిక్సింగ్ ఉదంతం నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో పాటు రాజస్థాన్ రాయల్స్‌పై రెండేళ్ల పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే.

# మైదానంలో నాకు అండగా నిలవండి

## ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా

ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తమ అభిమానులకు ఓ అభ్యర్థన చేశాడు. ఈ సారి తాను మైదానంలోకి అడుగుపెట్టినప్పడు హేళన చేయకుండా అండగా నిలవాలని కోరాడు. బ్యాటింగ్ చేసే సమయంలో.. టాస్ సందర్భంగా మైదానంలోకి వచ్చినప్పడు తనను ఎంకరేజ్ చేయాలని రిక్వెస్ట్ చేశాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో హార్దిక్ పాండ్యాను సొంత అభిమానులే గేలి చేసిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మను కాదని ముంబై ఇండియన్స్ సారథ్య బాధ్యతలను హార్దిక్ పాండ్యాకు కట్టబెట్టడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. సీజన్ మొత్తం అతనిపై విమర్శలు గుప్పించారు. టాస్ సమయంలో.. బ్యాటింగ్ చేసేటప్పడు రోహిత్ అని గట్టిగా అరుస్తూ దారుణంగా అవమానించారు. కెప్టెన్సీ ఆఫర్‌తోనే గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌లోకి వచ్చాడని, హార్దిక్ కారణంగానే రోహిత్ సారథ్యం కోల్పోయాడని ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. ఆ సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమై పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. సొంత అభిమానుల చేత ఘోర అవమానానికి గురైన హార్దిక్ పాండ్యా తీవ్ర మానసిక క్షోభను అనుభవించాడు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి అద్భుతంగా పుంజుకొని టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా హార్దిక్ పాండ్యానే కెప్టెన్‌గా కొనసాగించింది.

ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన హార్దిక్ పాండ్యా అభిమానులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పడు నన్ను ప్రోత్సహించండి. నేను సిక్స్ కొట్టినప్పడు గట్టిగా అరుస్తూ మరింత మద్దతు తెలపండి. టాస్ కోసం వచ్చినప్పడు.. బౌలింగ్ చేస్తున్నప్పడు కూడా నాకు అండగా నిలవండి. వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జెర్సీ కలర్ తప్పా మరే రంగును చూడకూడదనుకుంటున్నా. మిమ్మల్ని నేను కోరేది ఒక్కటే.'అని హార్దిక్ పాండ్యా చెప్పకొచ్చాడు. ఈ వ్యాఖ్యలు గతేడాది అతనికి జరిగిన అవమానాన్ని మరిచిపోలేదనే విషయాన్ని సూచిస్తున్నాయి. నిషేధం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు. అతని స్థానంలో సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించనున్నాడు.




# ఐపీఎల్ కప్పు కోసం రికీ పాంటింగ్ పూజలు!

ఐపీఎల్ 2025 కోసం అన్ని టీమ్స్ ప్రాక్టీస్ చేస్తుంటే ఓ టీమ్ మాత్రం పూజలు చేస్తోంది. అది కూడా ఏ సాధారణ పూజలు కాదు.. పెద్ద పెద్ద హోమాల రేంజ్‌లో చేస్తున్నారు. ఆ పూజలు చూస్తే ప్రత్యర్థులు కూడా భయపడి వారితో మ్యాచ్‌లు ఓడిపోయేలా ఉన్నాయి. పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ పుట్టినప్పటి నుంచి ఆడుతన్నా.. ఒక్కసారి కూడా ట్రోఫీ గెలవలేదు. వారితో పాటు ఢిల్లీక్యాపిటల్స్, ఆర్సీబీ కూడా కప్ప కొట్టకపోయినా.. వాళ్లకున్నంత ఫ్యాన్ బేస్ కూడా పంజాబ్‌కు లేదని చెప్పకోవచ్చు. ట్రోఫీ గెలిచేందుకు వాళ్లు చాలా సార్లు టీమ్‌లను మార్చేశారు. కెప్టెన్లను ఎన్ని సార్లు మార్చారో లెక్కేలేదు. అలాగే అనేక సార్లు జెర్సీలు, జెర్సీ రంగులు, లోగోలు ఏకంగా టీమ్ పేరు కూడా మార్చుకున్నారు. ఎన్ని మార్చినా, ఏం చేసినా వాళ్లకు కప్ప మాత్రం రాలేదు. అయితే ఈ సారి మాత్రం కప్ప కచ్చితంగా కొట్టాలనే ఉద్దేశంతో ఏకంగా భారీ భారీ పూజలు కూడా చేస్తున్నారు. అయితే ఈ పూజలో పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లతో పాటు ఆ జట్టు హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పాల్గొన్నాడు. అక్కడున్న పూజారులు పూజలు చేయిస్తుంటే.. ఆయన పూజలో పాల్గొన్నారు. ఈ పూజలు చూస్తుంటే ఈ సారి కప్ప పంజాబ్ కొట్టేలా ఉందని అభిమానులు సరదాగా కామెంట్ చేస్తున్నారు. మరి ఈ పూజలు పంజాబ్ కింగ్స్‌కు ఎంత వరకు కలిసి వస్తాయో, వారికి మొదటి ఐపీఎల్ ట్రోఫీని అందిస్తాయో లేదో చూడాలి. ఇక పోతే పంజాబ్ కింగ్స్ టీమ్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉన్న విషయం తెలిసిందే. ఓవరాల్‌గా పంజాబ్ టీమ్ కూడా బాగుంది.





# నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది' : యునైటెడ్ కింగ్‌డమ్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రతిష్ఠాత్మక గౌరవంపై స్పందించిన మెగాస్టార్ చిరంజీవి

బుధవారం (మార్చి 19, 2025) మెగాస్టార్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. యుకె పార్లమెంట్ లో హౌస్ ఆఫ్ కామన్స్‌లోని కొందరు పార్లమెంట్ సభ్యులు,మంత్రులు, అండర్ సెక్రటరీ లు, దౌత్యవేత్తలు మెగాస్టార్ చిరంజీవి ని సత్కరించారు. అదే సమయంలో, ఆయనకు బ్రిడ్జి ఇండియా అనే ప్రఖ్యాత యూకేకి చెందిన సంస్థ నుంచి సాంస్కృతిక నాయకత్వం వహిస్తూ ఆయన చేసిన ప్రజాసేవకుగానూ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. బ్రిడ్జి ఇండియా సంస్థ ఒక వ్యక్తికి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. అలాంటి అరుదైన సందర్భంలో చిరంజీవి కి ఆ అవార్డు రావడం నిజంగా ఎంతో ప్రత్యేకమే కాదు.. అసాధారణ గౌరవం కూడా. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ... ''హౌస్ ఆఫ్ కామన్స్ యుకె పార్లమెంట్ లోని కొందరు పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, అండర్ సెక్రటరీ లు, దౌత్యవేత్తల చే గౌరవించబడటం గౌరవంగా భావిస్తున్నాను. నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. ఈ క్రమంలో సభ్యులు నాపై గౌరవ భావాన్ని చూపిస్తూ మాట్లాడిన మాటలకు నేను ధన్యుడిని. బ్రిడ్జి ఇండియా బృందం నుండి జీవిత సాఫల్య పురస్కారం అందుకోవటం నన్నెంతగానో ఉత్సాహపరిచింది'' అంటూ చిరంజీవి తనకు దక్కిన ప్రత్యేక గుర్తింపు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ గౌరవం తనను మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ప్రేరేపిస్తుందని చెబుతూ మెగాస్టార్ చిరంజీవి ఇలా పేర్కొన్నారు. ''మాటలు సరిపోవు. అద్భుతమైన ప్రేమాభిమానాలను చూపించే అభిమానులు, రక్త దాతలు , నా సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు అందరూ నా ప్రయాణంలో ఎంతగానో సహకరించిన వారు, నేను మానవతా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంతో పని చేయడానికి ప్రేరేపిస్తుంది. నాపై మీ కున్న ప్రేమ, అభిమానాన్ని చూపిస్తూ అందరూ ఎన్నో అభినందన సందేశాల ను పంపారు. వారందరికీ ప్రేమతో ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను'' అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, దౌత్యవేత్త లతో సహా అనేక ప్రముఖ వ్యక్తులు హాజరయ్యారు. చిరంజీవి వారందరికీ సోషల్ మీడియా ద్వారా తన కృతజ్ఞతలు తెలిపారు.

# 'కన్నప్ప' నుంచి 'మహాదేవ శాస్త్రి' పరిచయ గీతం గ్లింప్స్

*డా. మంచు మోహన్ బాబు పుట్టిన రోజు (మార్చ్ 19) సందర్భంగా 'కన్నప్ప' నుంచి మహాదేవ శాస్త్రిని పరిచయం చేశారు. ఈ మేరకు మేకర్లు ఓ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. మహాదేవ శాస్త్రి పాత్ర కోసం మోహన్ బాబు ఎలా మేకోవర్ అయ్యారు? షూటింగ్ ఎలా జరిగింది? ఆ పాత్ర కోసం పడిన కష్టం ఏంటి? అని తెలియజేసేలా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్‌లో సుద్దాల అశోక్ తేజ సాహిత్యం, శంకర్ మహదేవన్ గాత్రం, స్టీఫెన్ దేవస్సీ బాణీ అద్భుతంగా ఉంది. మహదేవ శాస్త్రి ఔనత్యాన్ని తెలియజేసేలా ఈ పాట ఉండబోతోందని అర్థం అవుతోంది. మోహన్ బాబు బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఈ గ్లింప్స్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతోన్న కన్నప్ప సినిమాను ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టీజర్లు, పాటలకు మంచి స్పందన వచ్చింది. అలాగే అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ పోషించిన పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లకు మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఇక అతి త్వరలోనే కన్నప్ప ట్రైలర్‌ను రిలీజ్ చేసి మరింతగా అంచనాలు పెంచేందుకు చిత్రయూనిట్ రెడీగా ఉంది.*



# రామ్ పోతినేని #RAPO22 రాజమండ్రి షెడ్యూల్ పూర్తి

ఉస్తాద్ రామ్ పోతినేని కథానాయకుడిగా టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమాను నిర్మిస్తోంది. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' విజయం తర్వాత యంగ్ అండ్ టాలెంటెడ్ మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది. అందుకని #RAPO22ను వర్కింగ్ టైటిల్‌గా వ్యవహరిస్తున్నారు. రాజమండ్రిలో సెకండ్ షెడ్యూల్ ముగించుకుని చిత్ర బృందం హైదరాబాద్ వచ్చింది. రాజమండ్రిలో 34 రోజుల పాటు నాన్ స్టాప్‌గా డే అండ్ నైట్ షూటింగ్ చేసింది RAPO22 యూనిట్. ఈ షెడ్యూల్‌లో రెండు పాటలతో పాటు ఒక యాక్షన్ సీక్వెన్స్, ఇంకా ఇంపార్టెంట్ టాకీ సీన్స్ షూటింగ్ చేశారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో అందమైన లొకేషన్లను అంతే అందంగా క్యాప్చర్ చేశామని చిత్ర బృందం చెబుతోంది. రాజమండ్రిలో జరిగిన చిత్రీకరణలో హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సహా రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ తదితర తారాగణం మీద సినిమా చిత్రీకరించారు. మార్చి 28వ తేదీ నుంచి హైదరాబాద్ షెడ్యూల్ మొదలవుతుందని నిర్మాతలు తెలిపారు.





# దిల్ రాజు ప్రొడక్షన్స్ పాన్ ఇండియన్ మల్టీస్టారర్ చిత్రం

టాలీవుడ్‌లో నిర్మాతగా దిల్ రాజుకి ఉన్న బ్రాండ్ అందరికీ తెలిసిందే. దిల్ రాజు ప్రొడక్షన్స్ నుంచి ఓ సినిమా వస్తుందంటే క్వాలిటీ విషయంలో, కంటెంట్ విషయంలో అందరిలోనూ భారీ స్థాయిలో అంచనాలుంటాయి. అలాంటి దిల్ రాజు బ్యానర్ నుంచి ఓ క్రేజీ పాన్ ఇండియన్ చిత్రం రాబోతోంది. ఈ చిత్రానికి హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మలయాళంలో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'మార్కో'తో దర్శకుడు హనీఫ్ అదేని పేరు బాగానే ట్రెండ్ అయింది. అలాంటి ఓ క్రేజీ డైరెక్టర్‌తో దిల్ రాజు ప్రొడక్షన్స్ ఓ సినిమాను చేయబోతోంది. శిరీష్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ప్రస్తుతం ఇంకా ఈ ప్రాజెక్ట్ టైటిల్ ఖరారు కాలేదు. ఈ మూవీని హ బడ్జెట్ తో పాన్ ఇండియా మల్టీస్టారర్‌గా తెరకెక్కిస్తున్నారు. మార్కోతో హనీఫ్ తనలోని మాస్, వయలెన్స్, యాక్షన్ యాంగిల్‌ను చూపించారు. ఇక ఇప్పుడు ఈయన తెలుగులోకి ఎంట్రీ ఇవ్వబోతోన్నారు. ఇక ఈ ప్రకటనతో తెలుగు ప్రేక్షకుల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. గురు ఫిల్మ్స్‌కు చెందిన సునీతా తాటి ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యారు. ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేయనున్నారు.



# మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వేడుకల్లో విజయ్ దేవరకొండ



*ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా జరిగే మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ యొక్క వార్షిక ఏకత్వ దినోత్సవ వేడుక 2025 ఈ ఏడాది విజయ్ దేవరకొండ గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారని మరింత ప్రత్యేకంగా జరిగింది. సురారంలోని మల్లారెడ్డి క్రికెట్ గ్రౌండ్ లో ఈ వేడుక మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు సిహెచ్ మల్లారెడ్డి, మల్లారెడ్డి గారు యూనివర్సిటీ వ్యవస్థాపకులు, ఛైర్మన్, డా. భద్రారెడ్డి గారు , మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ ఛైర్మన్, డా. సిహెచ్ ప్రీతి రెడ్డి గారు , మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ ఛైర్మన్, స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నితిన్ , స్టార్ హీరో తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ గారు మాట్లాడుతూ.. మల్లారెడ్డి ఎప్పటికప్పుడు చెబుతుంటారు పాలు, పూలు అమ్మి ఈ స్థాయికి వచ్చానని, దేశం గర్వించదగిన మూడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, కానీ అందులో అంతకన్నా ఆయనకు విద్యార్థుల ప్రేమ ఎంతో విశేషమైనదని అన్నారు. "మనకు నచ్చిన పనిని చేస్తే మనం నిజంగా సంతోషంగా ఉంటాము. అందుకే సినిమాల షూటింగ్ సమయంలో సంతోషంగా ఉంటాను, సినిమా బ్లాక్ బస్టర్ అయితే ఇంకా ఆనందంగా ఉంటాను" అని విజయ్ దేవరకొండ అన్నారు. అలాగే, "ఎప్పుడూ స్టూడెంట్స్ తో ఉంటే చాలా ఉత్సాహంగా ఉంటాను. నా కాలేజీ రోజులు గుర్తుకువస్తాయి. 10 సంవత్సరాల క్రితం 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చాలామంది కాలేజీలను తిరిగి, విద్యార్థులతో మాట్లాడిన అనుభవం గుర్తు అవుతుంది" అని ఆయన గుర్తుచేసారు.*



# మాతృత్వపు మాధుర్యం ఆస్వాదిస్తున్నా: దీపిక

**బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బిడ్డతో కొంతకాలంగా సరదాగా గడిపిన దీపికా తిరిగి షూటింగ్‌లలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిగా తన కుమార్తెతో సమయం గడపడం, చిత్రీకరణలో పాల్గొనడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఒక తల్లిగా చిత్రీకరణలో పాల్గొనడం అనేది ఎప్పుడూ సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై షూటింగ్‌లలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్రీకరణల్లో పాల్గొనాలి. ఈ విషయంలో సలహాలు ఇచ్చేందుకు ఎంతోమంది మహిళలు ఉన్నారని నాకు తెలుసు. కానీ, ఇది నాకు అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నాను. కచ్చితంగా దీన్ని ఎదుర్కొంటాననే నమ్మకం నాకు ఉంది. మాతృత్వం అనేది గొప్ప అనుభూతి. ఇది నేను ఎంచుకొనే సినిమాలపై ప్రభావం చూపుతుందని నాకు తెలుసు. నేను తల్లి కాకముందు కూడా సినిమాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నాను. ఇకపై కూడా అలానే తీసుకుంటాను' అని దీపికా చెప్పారు. దీపికా చివరిసారిగా 'సింగం అగైన్' లో శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు- గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.**

# పెళ్ళికాని ప్రసాద్' సినిమాని మంచి హిట్ చేసి సప్తగిరికి మంచి జీవితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను

**: ప్రీరిలీజ్ ఈవెంట్ లో హాస్య బ్రహ్మ బ్రహ్మానందం**

సప్తగిరి హోల్సమ్ ఎంటర్ టైనర్ 'పెళ్లి కాని ప్రసాద్'. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం హ్యూమర్, సోషల్ కామెంటరీ బ్లెండ్ తో పర్ఫెక్ట్ ఎంటర్ టైనర్ గా ఉండబోతోంది. థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై. బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పిస్తోంది. దిల్ రాజు నేతృత్వంలోని ప్రముఖ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (SVC) ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా మార్చి 21న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ మారుతి ముఖ్య అతిధులుగా హాజరైన ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్ గా జరిగింది. హాస్యబ్రహ్మ బ్రహ్మానందం మాట్లాడుతూ.. అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకి రావడానికి ప్రధాన కారణం సప్తగిరి. చిరంజీవి గారు మొన్న బ్రహ్మ ఆనందం ఈవెంట్ కి ఇన్విటేషన్ లేకుండానే నేనే వస్తానని వచ్చారు. పెద్దవాళ్ల దగ్గర నుంచి నేర్చుకోవాల్సిన విషయం. రీసెంట్ గా ఆ విషయం నేర్చుకున్నాను కాబట్టే ఈ వేడుకకి ఏ ఇన్విటేషన్ లేకుండా వచ్చాను. తమ్ముడు సప్తగిరి సినిమా ఇది. తమ్ముడు కంటే ఒక హాస్య నటుడు సినిమా హిట్ కావాలని ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాను. ఇన్విటేషన్ అనేది స్నేహితుల మధ్య జరిగేది ఆత్మీయులు మధ్య పిలుపులు ఉండవు. ఈ సినిమా కోసం సప్తగిరి చాలా శ్రమ పడ్డాడు. గత 15 రోజులుగా ఏకాకిగా తిరిగాడు. అందరితో కలిసిపోయి తన ప్రతిభని ప్రదర్శించి కనిపించి కనిపించని అందరి దేవుళ్ళని మొక్కుకున్నాడు. విజయం సాధిస్తే సినిమాని నమ్ముకుని వచ్చిన నేను హాయిగా నాలుగు మెతుకులు తిని బతుకుతాను అని చెప్పాడు. ఈ మాట మీతో పంచుకోవాలని ఈ వేడుకకు వచ్చాను. ప్రేక్షకుల్ని పదికాలాలపాటు నవ్వించాలనే తపన పడేవాడు హాస్యనటుడు. హాస్యనటుడుది మనల్ని నవ్వించే వృత్తి. నిజంగా ఇది పవిత్రమైనది. నాకు ఈ అవకాశం కల్పించిన మిత్రులందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ సినిమా ట్రైలర్ చూశాను. చాలా నచ్చింది. ఇందులో అన్నపూర్ణమ్మ ఉంది. తనని అప్పా అని పిలుస్తాను. ట్రైలర్లో ఆమెని చూశాక ఒక 40 ఏళ్ల జర్నీ గుర్తుకొచ్చింది. పెళ్ళికాని ప్రసాద్ సినిమాని మంచి హిట్ చేసి మంచి హాస్యనటుడికి మంచి జీవితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను'

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail: prabhathasuryudunewsdesk@gmail.com RNI: TELTEL12215